ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



అన్నమయ్య

జిల్లా వార్తలు

5

ఆదివారం 12 మే 2024



కూటమిలో కదనోత్సాహం

- కలిసొచ్చిన అగ్రనేతల ప్రచారం..
- గడప గడపా తాకిన కూటమి నేతలు
- అడుగడుగునా జననీరాజనం..
- వైసీపీని దెబ్బకొట్టిన ప్రజావ్యతిరేకత
- గెలుపు ధీమాలో ఎన్డీయే కూటమి అభ్యర్థులు
- నిరాశలో వైసీపీ..
- జగన్ ప్రచారాలకు జనం కరువు
- డబ్బునే నమ్ముకున్న అధికార పార్టీ



(రాయచోటి-ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి జిల్లాలో గడపగడపనూ తాకింది. గత ఐదేళ్లలో అన్ని రకాలుగా సర్వనాశనం అయిన రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టాలంటే కూటమే అధికారంలోకి రావాలని ప్రజలకు వివరించారు. దీంతో కూటమిలో కదనోత్సాహం తొణికసలాడుతోంది. యాభై రోజులుగా జరిగిన ప్రచారంలో ప్రజల నుంచి వచ్చిన అనూహ్య స్పందనతో కూటమిలో గ్రామ స్థాయి కార్యకర్త నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకుల్లోనూ గెలుపుపై ధీమా కనపడుతోంది. కూటమికి చెందిన అగ్రనేతల ప్రచారం.. అగ్రనేతల ప్రచారానికి జనం నీరాజనం పట్టడం కూటమికి మరింత బలాన్ని ఇచ్చింది. ఇదే సమయంలో వైసీపీ నాయకుల్లో నిరాశ కొట్టొచ్చినట్లు కనపడుతోంది. పల్లెలు, పట్టణాలు, మునిసిపాలిటీలు, కార్పొరేషన్‌లు ఇలా.. అన్నిచోట్లా.. ప్రజావ్యతిరేకత తుఫాన్‌లా రాష్ట్ర ప్రభుత్వాన్ని కమ్మేయనుంది. ఇదే సమయంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాలో జరిపిన ప్రచార సభలకు జనం కరువయ్యారు. బస్సుయాత్ర తుస్సుమంది. దీంతో ప్రజల మద్దతు కరువైనట్లు గుర్తించిన అధికార పార్టీ ఇక డబ్బుపైనే నమ్మకం పెట్టుకుందనే ఆరోపణలు ఉన్నాయి. ఎంత ఖర్చు చేసైనా సరే.. ఓటు కొనేందుకు డబ్బు మూటలు కుమ్మరిస్తోందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

గడపగడపకూ.. కూటమి

జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో గత యాభై రోజులుగా కూటమి నాయకులు, అభ్యర్థులు ప్రచారాన్ని ఉధృతంగా చేశారు. దాదాపు ప్రతి గడపకూ వెళ్లి ఈ ఎన్నికల్లో కూటమి అధికారంలోకి ఎందుకు రావాలో వివరించారు. అదే సమయంలో గత ఐదేళ్లలో జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని, అన్ని వ్యవస్థలనూ ఏ విధంగా ధ్వంసం చేసిందీ వివరించారు.

- తంబళ్లపల్లె నియోజకవర్గంలో కూటమి తరపున బరిలో ఉన్న టీడీపీ అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి, నియోజకవర్గానికి చెందిన పార్టీ ముఖ్యనాయకులు, జయచంద్రారెడ్డి కుటుంబసభ్యులు ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గంలోని నాయకులు అందరూ ఏకతాటికిపైకి వచ్చి ప్రచారం చేశారు. గెలుపు తమదేనని, వైసీపీ నాయకులు ఇక్కడ చేసిన అరాచకాలే వారి పాలిట శాపాలుగా మారి ఓటమి పాలు చేస్తామని జయచంద్రారెడ్డి ధీమా వ్యక్తం చేస్తున్నారు.
- మదనపల్లెలో కూటమి తరపున టీడీపీ అభ్యర్థి షాజహాన్‌బాషా నియోజకవర్గమంతా కలియతిరిగారు. మాజీ ఎమ్మెల్యేగా ఆయనకున్న అనుభవం, పరిచయాలతో ఆయన జనంలోకి దూసుకెళ్లారు. ఇదే సమయంలో నియోజకవర్గంలోని కూటమి నాయకులు అందరూ ఐకమత్యంగా అభ్యర్థి గెలుపు కోసం మూకుమ్మడిగా ప్రచారం నిర్వహించారు. టీడీపీ, బీజేపీ, జనసేన నేతల సంపూర్ణ మద్దతుతో గెలుపు తమదేనని షాజహాన్‌బాషా చెబుతున్నారు.
- పీలేరు నియోజకవర్గంలోని కూటమి తరపున టీడీపీ అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, ఆయన సతీమణి తనుజారెడ్డితో పాటు కుటుంబ సభ్యులు నియోజకవర్గమంతా కలియతిరిగారు. నాయకులు అందరినీ కలుపుకుని ప్రచారం నిర్వహించారు. గెలుపు తమదేనని మెజార్టీపైనే దృష్టి సారించినట్లు టీడీపీ నాయకులు చెబుతున్నారు.
- రాయచోటిలో కూటమి తరపున టీడీపీ అభ్యర్థి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి, ఆయన సోదరుడు, ఇతర కుటుంబ సభ్యులు, పార్టీలోని ఇతర ముఖ్య నాయకులు ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. నియోజక వర్గంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి వైసీపీ చేసిన అరాచకాలను ప్రజలకు వివరించడంలో ఆయన సఫలీకృతులయ్యారు. దీంతో గెలుపు తమదేనని ధీమాలో ఉన్నరు.
- రాజంపేట నియోజకవర్గంలో కూటమి తరపున టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం, ఆయన సోదరులతో పాటు తండ్రి, మాజీ ఎంపీ, ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు ముమ్మరంగా ప్రచారం చేశారు. వీరితో పాటు నియోజకవర్గంలోని ఇతర ముఖ్యనాయకులు కూడా గడపగడప తిరిగి బాలసుబ్రమణ్యంను గెలపించాలని ఉధృతంగా ప్రచారం చేశారు. ఇక్కడ వైసీపీ నుంచి ముఖ్య నాయకులంతా టీడీపీలో చేరడంతో గెలుపు తమదేనని సుబ్రమణ్యం ధీమాగా ఉన్నారు.
- రైల్వేకోడూరులో కూటమి తరపున జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ఇతర ముఖ్యనాయకులు అభ్యర్థిని గెలిపించాలని ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. టీడీపీ, బీజేపీ నాయకుల సంపూర్ణ మద్దతుతో గెలుపు తమదేనని జనసేన నేతలు చెబుతున్నారు.
- రాజంపేట పార్లమెంటు స్థానానికి కూటమి తరపున బీజేపీ అభ్యర్థిగా బరిలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆయన కుమారుడు, బీజేపీ జిల్లా నాయకులు పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో ముమ్మరంగా ప్రచారం చేశారు. ప్రస్తుత వైసీపీ ఎంపీ ప్రజలకు చేసిందేమీ లేదని, దోచుకోవడానికే ఆయన పదవిని చేపట్టారని ప్రజలకు వివరించడంలో నాయకులు సఫలమయ్యారు. దీంతో గెలుపు తమదేనని ఎంపీ అభ్యర్థి ధీమాగా చెబుతున్నారు.

కలిసొచ్చిన అగ్రనేతల ప్రచారం

కూటమి తరపున అభ్యర్థుల గెలుపు కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీ, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు, జనసేనాని పవన్‌కళ్యాణ్, టీడీపీ జాతీయప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తదితరులు జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో ప్రచారం నిర్వహించారు. రాజంపేట పార్లమెంటు అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపు కోసం ప్రధాని నరేంద్రమోదీ పీలేరు నియోజకవర్గం కలికిరిలో జరిగిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ఇదే సభలో నారా లోకేశ్, జనసేన ముఖ్య నాయకులు నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గం అంగళ్లులో, రాయచోటి, మదనపల్లెలో జరిగిన బహిరంగ సభలో చంద్రబాబునాయుడు పాల్గొన్నారు. నోటిఫికేషన్‌కు ముందే పీలేరులో జరిగిన బహిరంగ సభలో చంద్రబాబునాయుడు పాల్గొన్నారు. రాజంపేట, రైల్వేకోడూరులో జరిగిన బహిరంగ సభల్లో చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్‌లు కలిసి పాల్గొన్నారు రాయచోటి ఎమ్మెల్యే అభ్యర్థి రాంప్రసాద్‌రెడ్డికి మద్దతుగా మాజీ ఎంపీ, ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు ప్రచారంలో పాల్గొన్నారు. రాజంపేటలో తన పెద్దకొడుకు సుగవాసి బాలసుబ్రమణ్యం గెలుపు కోసం పాలకొండ్రాయుడు ప్రచారం చేశారు. ఇలా ముఖ్యనాయకులు కూటమి అభ్యర్థుల కోసం ప్రచారంలోకి దిగడం కూటమికి మరింత బలం ఇచ్చింది. కూటమి నాయకులు అందరూ విభేదాలు లేకుండా ఏకతాటిపైకి రావడంతో కూటమిలో నూతనోత్సాహం కనిపించింది.

వైసీపీలో నిరాశ

ప్రతిపక్ష పార్టీల కూటమిలో ఉత్సాహం ఉరకలు వేస్తోంటే అధికార వైసీపీ నాయకులు నిరాశలో ఉన్నారు. జిల్లాలోని దాదాపు ప్రతి నియోజకవర్గంలోనూ అధికార పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులు ప్రచారానికి వెళ్లినపుడు జనం నుంచి సరైన స్పందన కనిపించలేదు. పలుచోట్ల అభ్యర్థులను ప్రజలు సమస్యలపైన నిలదీశారు. కొన్నిచోట్ల అధికార పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థుల ప్రచారాన్ని అడ్డుకున్నారు. మా ఊరికి రావద్దంటూ.. ముఖాన్నే చెప్పేశారు. ఇసుక అక్రమ రవాణా, మద్యం అమ్మకాలు, అధికార పార్టీ నాయకులు దాడులు, దౌర్జన్యాలు, భూఆక్రమణలు వంటి సంఘటనల వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత బాహాటంగానే కనిపించింది. ఇదే ప్రభావం సాక్షాత్తు ముఖ్యమంత్రి సభలపైనా పడింది. తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాల్లో ముఖ్యమంత్రి జరిపిన బస్సుయాత్ర జనం లేక తుస్సుమంది. పీలేరు నియోజకవర్గం కలికిరిలో జరిగిన బహిరంగ సభకు జనం పెద్దగా రాలేదు. వచ్చిన వాళ్లు సైతం ముఖ్యమంత్రి ప్రసంగం మొదలు కాగానే.. వెళ్లిపోయారు. ఇదే పరిస్థితి రాజంపేటలో జరిగిన జగన్ సభలోనూ కనిపించింది. జగన్ ప్రసంగానికి జనం నుంచి పెద్దగా స్పందన కనిపించలేదు. ఇదే సమయంలో కడప ఎంపీ స్థానానికి పోటీ చేస్తున్న వైఎస్ షర్మిల, ఆమెకు మద్దతు ఇస్తున్న స్వర్గీయ మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీతలు జగన్ అండ్ కో మీద చేస్తున్న ఆరోపణల ప్రభావం అన్నమయ్య జిల్లాలోనూ కనిపించింది. ఈ నేపథ్యంలో వైసీపీలో ముఖ్యనాయకుల నుంచి కింది స్థాయి కార్యకర్తల వరకు ఓటమి భయం వెంటాడుతోంది. ఇక చివరి అస్త్రంగా అధికార పార్టీ ఓటర్లను కొనుగోలు చేసేందుకు డబ్బు విచ్చలవిడిగా ఖర్చు చేస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల్లో ఏ పార్టీకి ప్రజలు పట్టం కడతారో వేచి చూడాల్సిందే.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోండి

- పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాం
- 144 సెక్షన్ అమలు
- ఓటర్లు పోలింగ్ స్టేషన్‌కు మొబైల్ తీసుకురాకూడదు
- జిల్లాలో 80 శాతం పోలింగ్‌స్టేషన్‌లలో వెబ్ కాస్టింగ్
- 415 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాం
- జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్

రాయచోటి (కలెక్టరేట్), మే 11: ఎన్నికల్లో జిల్లాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని రకాల చర్యలు తీసుకున్నామని, ప్రతిఒక్కరూ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రజలకు జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్ తెలిపారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో జూన్ 6వ తేదీ వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎవరూ ఎన్నికల నియమావళి ఉల్లంఘించవద్దని హెచ్చరించారు. పీలేరు, రాయచోటి, తంబళ్లపల్లె సమస్యాత్మక నియోజకవర్గాలుగా గుర్తించడంతో పాటు ఆయా నియోజకవర్గాల్లో వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చామన్నారు. పోలింగ్ స్టేషన్ పరిధిలో దాదాపు 200 మీటర్లు మేరకు అక్కడ ఎటువంటి ప్రలోభాలు కానీ ఇతర కార్యక్రమాలు చేయకూడదని ఆయన స్పష్టం చేశారు. ఓటు వేయడానికి వచ్చిన ప్రతి వ్యక్తి తన మొబైల్‌ను పోలింగ్ స్టేషన్‌కు తీసుకురాకుండా ఉండాలన్నారు. జిల్లాలో కల్యాణ మండపాలు, లాడ్జీల్లో బయట జిల్లాలకు సంబంధించిన వారు ఎవరూ మన జిల్లాలో ఉండటానికి కుదరదని స్పష్టం చేశారు. ఎస్పీ కృష్ణారావు మాట్లాడుతూ జిల్లాకు దాదాపు 11 కంపెనీల ద్వారా మిలటరీ బలగాలు వచ్చాయని తెలిపారు. పోలింగ్ స్టేషన్ దగ్గర గానీ, బయట క్యూలో నిలిచి ఉన్న ఓటర్స్‌ను కానీ భయభ్రాంతులకు గురిచేసినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో అల్లర్లు సృష్టించిన వారిపై ఇప్పటికే నిఘా పెట్టామన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను ఎవరు అతిక్రమించినా వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో ప్రజలందరూ ఓటును సద్వినియోగం చేసుకునే విధంగా అన్ని రకాల చర్యలు తీసుకున్నామని తెలిపారు.

పోలింగ్ కేంద్రాల్లో పక్కాగా సౌకర్యాలు

రాయచోటి టౌన్, మే 11: జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు పక్కాగా ఉండాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన రాయచోటి పట్టణంలోని నూరానా మసీదు, గుర్రంకొండ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలు, మదనపల్లె పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్, ఈశ్వరమ్మ కాలనీలోని పోలింగ్ కేంద్రాలను, కురబలకోట మండలం మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 1609 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. విభిన్న ప్రతిభావంతులు వంద శాతం ఓటు హక్కును వినియోగించుకొనేలా పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపు, వీల్‌చైర్స్‌తో పాటు బీఎల్‌వో, వీఆర్‌ఏను వారికి సహాయకులుగా అందుబాటులో ఉంచాలన్నారు. పోలింగ్ సిబ్బందికి సామాగ్రిని అందించడంలో ఎలాంటి లోటుపాట్లు ఎదురుకాకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యుత్ సమస్య తలెత్తకుండా జనరేటర్లు ఏర్పాటు చేసుకోవాలని అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో రాయచోటి ఆర్డీవో రంగస్వామి, మదనపల్లె ఆర్డీవో హరిప్రసాద్, మదనపల్లె మున్సిపల్ కమిషనర్ ప్రమీల, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్‌కిశోర్, ఎస్పీ కృష్ణారావు

కాంగ్రెస్‌లో నయాజోష్

- రాహుల్‌గాంధీ రాకతో శ్రేణుల్లో ఉత్తేజం
- షర్మిలను చెల్లితో పోల్చిన రాహుల్‌గాంధీ

(కడప-ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిన్నటిదాకా కాంగ్రెస్ పరిధి గత వైభవంగా ఉండేది. పదేళ్లకు ముందు జిల్లాలో కాంగ్రెస్ చాలా పటిష్ఠంగా ఉండేది. అయితే రాష్ట్ర విభజన అనంతరం జగన్ సొంత పార్టీతో కుదేలైంది. అయితే అలాంటి పార్టీకి మళ్లీ రాజన్న బిడ్డ షర్మిలతో మళ్లీ జవసత్వాలు నింపుకుంటుంది. పీసీసీ చీఫ్ బాధ్యతలతో కడప పార్లమెంటు నుంచి పోటీ చేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే పార్లమెంటు పరిధిలో రెండు పర్యాయాలు విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేశారు. దీంతో స్తబ్దుగా ఉన్న కాంగ్రెస్‌కు జవసత్వాలు వచ్చాయి. ఎన్నికల సమయం దగ్గర పడే సరికి జోష్ క్రియేట్ అయింది. ఇక షర్మిలకు మద్దతుగా డాక్టర్ సునీత, సౌభాగ్యమ్మ ప్రచారం చేశారు. దీంతో వైఎస్ వివేకా అభిమానులు, కాంగ్రెస్ షర్మిల వైపు చూశారు. ఎన్నికల ప్రచారం చివరి రోజు శనివారం కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ కడపలో జరిగిన బహిరంగసభలో షర్మిల నా చెల్లి అంటూ సంబోధించారు. రాజశేఖర్‌రెడ్డి పాదయాత్ర స్ఫూర్తితో నేను భారత జోడోయాత్రకు శ్రీకారం చుట్టానని, కాంగ్రెస్, వైఎస్ వేర్వేరు కాదు, కాంగ్రెస్సే వైఎస్ వైఎస్సే కాంగ్రెస్ అంటూ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ వైఎస్‌కు ఎంత ప్రాధాన్యతనిస్తుందో చెప్పుకొచ్చారు.సభ సక్సెస్ కావడంతో కాంగ్రెస్‌లో ఇప్పుడు నయాజోష్ కనిపిస్తోంది. కడప జిల్లాలో షర్మిల దాదాపు 18 రోజుల పాటు పర్యటించింది. అయితే ఆ ప్రచారంలో ఆమె హావభావాలు, మాట తీరు అన్నీ వైఎస్‌ఆర్‌ను గుర్తుకు తెస్తాయి. ఇలా షర్మిల జనాలకు బాగా దగ్గరైంది. ఇక రాహుల్‌గాంధీ మాట్లాడుతూ దేశంలో నేను ఏ పార్లమెంటులో ఎక్కడా అడగలేదు. నేను కడపలో అడుగుతున్నా షర్మిలను ఢిల్లీకి పంపిస్తామని మీరంతా వాగ్దానం చేయాలంటూ విజ్ఞప్తి చేశారు. అప్పుడు కార్యకర్తల నుంచి మంచి స్పందన వచ్చింది. సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ కడప పార్లమెంటు నుంచి ఇంత మంది ఎంపీలుగా గెలిచినా ఒక్కరూ కేంద్ర మంత్రి కాలేదని షర్మిలను గెలిపిస్తే కేంద్రంలో మంత్రి అవుతుందని గెలిపించాలన్నారు. బహిరంగసభకు కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో పాటు అగ్రనేతలు వచ్చారు. సభ సక్సెస్ కావడంతో కాం గ్రెస్‌లో మంచి జోష్ నింపింది. రాహుల్‌గాంధీ మాట్లాడినప్పుడల్లా పీఎం పీఎం అంటూ నినాదాలు చేయడం కాంగ్రెస్‌లో ఊపునిచ్చింది.



కడపలో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతున్న రాహుల్ గాంధీ

ఓటుకు నోటు తీసుకోలేదని దళితుడిపై దాడి

- దాడి చేసి కారులో వేసుకుని వెళ్లారు..

రాయచోటి, మే 11 (ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు నియోజకవర్గం పుల్లంపేట మండల పరిధిలోని పాపక్కగారిపల్లెలో వైసీపీ నాయకులు ఓటుకు నోటు పంపిణీ చేస్తుండగా మద్దెల గంగయ్య అనే వ్యక్తి డబ్బులు తీసుకోలేదని వైసీపీ నాయకుడు శనివారం సాయంత్రం దాడి చేసి గాయపరిచారు. వైసీపీ నాయకులు ఓట్లకు డబ్బులిస్తూ మద్దెల గంగయ్య ఇంటి వద్దకు వెళ్లారు. మండలంలోని ఓ ముఖ్య వైసీపీ నాయకుడి కుమారుడు డబ్బులిస్తుండగా మద్దెల గంగయ్య నాకు డబ్బులు వద్దని నిరాకరించాడు. మాకు భూములు లేవని, మాకు మీరు ఏమీ చేయలేదని చెప్పడంతో మాకు ఎదురుతిరుగుతావా అంటూ ముఖ్య నాయకుడి కుమారుడితో పాటు అనుచరులు మమ్మల్నే ప్రశ్నిస్తావా అంటూ చితకబాదారు. మద్దెల గంగయ్య తల్లి కాళ్ల మీద పడి ప్రాధేయపడినా వదల్లేదు. చివరకు మద్దెల గంగయ్యను కొట్టి కారులో వేసుకుని వెళ్లిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. మద్దెల గంగయ్య తల్లి రాత్రి పుల్లంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వచ్చింది. దీనిపై పుల్లంపేట ఎస్ఐ రఘురాంను ఫోన్‌లో సంప్రదించగా ఆయన అందుబాటులో లేరు. ఈ సంఘటన జరగడంతో కొంతమంది టీడీపీ నాయకులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని రాత్రి 10 గంటల వరకు ఎస్ఐ కోసం వేచి ఉన్నా బాధితుడి జాడ తెలియలేదని, తాము ఆందోళన చెందుతున్నామని పుల్లంపేట ఎస్ఐ తీరుపై వారు అసహనం వ్యక్తం చేశారు.



గంగయ్యపై దాడి చేస్తున్న వైసీపీ నాయకులు

మదనపల్లె చౌదేశ్వరి సర్కిల్ సమీపంలోని వైన్‌షాపు ముందు క్యూ కట్టిన మద్యం ప్రియులు



మందుచూపు..

- రెండు రోజులు దుకాణాలు బంద్ కానుండటంతో..
- షాపుల ముందు మందుబాబుల క్యూ

మదనపల్లె, మే 11: ఎన్నికలు వచ్చాయంటే.. అన్ని వర్గాలకు పండుగనే చెప్పాలి. అలాంటి వాటికి ఎన్నికల కమిషన్ దాదాపు ముక్కుతాడు వేసింది. మరీ ముఖ్యంగా ఎన్నికల కోడ్ వచ్చింది మొదలు మద్యంప్రియులకు మందు కష్టాలు వచ్చి పడ్డాయి. నెలరోజులకుపైగా వీరికి ఇవే బాధలు, ఇవే కష్టాలు. ఉదయం మద్యం దుకాణం తెరిచింది మొదలు.. మూత పడేవరకూ పడిగాపులే. మత్తుకు బాగా అలవాటుపడిన కొందరు కూలీలు.. పనులు వదులుకుని మరీ మద్యం దుకాణం ముందు క్యూ కడుతున్నారు. తమకు కావాల్సిన ధరకు, తనకు ఇష్టమైన బ్రాండు కోసం నిరీక్షిస్తున్నారు. ఉదయం 11 గంటలకు షాపు తెరిచింది మొదలు.. స్టాకు అయిపోయి మూత పడేవరకూ క్యూ తగ్గడం లేదు. శనివారం ఆ క్యూ మరింత దూరం, మరింత సమయం పెరిగింది. ఇదేమని ఆరా తీస్తే..ఎన్నికల ప్రక్రియలో ప్రధాన క్రతువు సోమవారం పోలింగ్ ఉండటంతో ఆదివారం, సోమవారం రెండు రోజులు మద్యం దుకాణాలు మూతపడనున్నాయి. దీంతో మద్యం ప్రియులు ఈ రెండు రోజులకు సరిపడే సరుకును నిల్వ చేసుకోవడానికి షాపుల ముందు బారులు తీరారు. కొందరైతే ఎండకు తట్టుకోలేక గొడుగులు చేత పట్టుకుని క్యూలో నిల్చున్నారు.

టీడీపీ నేతపై వైసీపీ వర్గీయుల దాడి

డబ్బులు పంచొద్దన్నందుకు పోలి చిన్నసుబ్బారెడ్డిపై కత్తితో దాడి

రాజంపేట టౌన్, మే 11 : మండలంలోని పోలి పంచాయతీ చిన్నిల్లుగారిపల్లెలో శనివారం రాత్రి టీడీపీ, వైసీపీ నేతల మధ్య ఘర్షణ జరిగింది. వైసీపీ నేతలు ఓటర్లకు డబ్బులు పంచేందుకు గ్రామానికి రావడంతో టీడీపీ నేత పోలి సుబ్బారెడ్డి సోదరుడు పోలి చిన్నసుబ్బారెడ్డి వారిని అడ్డుకున్నారు. తమ గ్రామంలో ఓటర్లకు ఎలా డబ్బులు పంచుతారని నిలదీశారు. దీంతో వైసీపీ నేతలు జయచంద్రారెడ్డి, రఘునాథరెడ్డి, విశ్వనాథరెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డిలు ఆయనతో ఘర్షణకు దిగి తలపై కత్తితో దాడి చేయడంతో పోలి చిన్నసుబ్బారెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘర్షణలో వైసీపీ నేతలకు స్వల్ప గాయాలయ్యాయి. టీడీపీ నేతకు ప్రథమ చికిత్స చేసి తిరుపతికి తరలించారు. విషయం తెలిసిన వెంటనే టీడీపీ నేతలు వేమన సతీశ్, పోలి సుబ్బారెడ్డి, ప్రతాప్‌రాజు, ఇడిమడకల కుమార్, బీజేపీ నాయకుడు నాగోతు రమేశ్‌నాయుడు తదితర నాయకులు అక్కడికి చేరుకున్నారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమర్‌నాథరెడ్డితో పాటు నాయకులు అక్కడికి చేరుకుని గాయపడ్డ వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఇరువర్గాలు అక్కడికి చేరుకోగా వైసీపీ నేతలను మాత్రం ఆస్పత్రిలోకి పంపి టీడీపీ వారిని పంపలేదు. దీంతో లోపలికి ఎందుకు పంపలేదని టీడీపీ నేత వేమన సతీశ్ డీఎస్పీ చైతన్యను అడిగారు. ఈ సందర్భంగా వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో ఆస్పత్రి వద్ద ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టి 144 సెక్షన్ విధించారు.



గాయపడ్డ పోలి చిన్నసుబ్బారెడ్డి



ఆస్పత్రి వద్ద డీఎస్పీతో వాగ్వాదం చేస్తున్న టీడీపీ నేత వేమన సతీశ్



మాట.. మైకు.. బంద్

- ప్రచారానికి శుభం కార్డు..
- పోలీసుల ముమ్మర తనిఖీలు
- అమలులోకి 144 సెక్షన్

రాయచోటి, మే 11 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల కోసం సుమారు యాభై రోజులుగా రాజకీయ పార్టీలు జోరుగా సాగించిన ప్రచారానికి శనివారం సాయంత్రం 6 గంటలతో శుభం కార్డు పడింది. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం.. అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకుల మాటలు, మైకులు బంద్ అయ్యాయి. ఇదే సమయంలో పోలీసుల తనిఖీలు ముమ్మరం అయ్యాయి. 144 సెక్షన్ అమలులోకి వచ్చింది. ప్రచారానికి తెరపడడంతో ప్రలోభాలకు తెరలేచింది. మరో 24 గంటల్లో ఎన్నికల ఘట్టం మొదలు కానుంది. మార్చి 16న ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చింది. అంతకు ముందు నుంచే దాదాపు టికెట్లు ఖరారైన అభ్యర్థులు ప్రచారాన్ని మొదలు పెట్టేశారు. ఇంటింటికీ తిరిగి ఓట్ల వేట మొదలు పెట్టారు. వైసీపీ, తెలుగుదేశం పార్టీలు తమ అభ్యర్థులను ఖరారు చేశాయి. జనసేన, బీజేపీ, కాంగ్రెస్, సీపీఐలు కూడా తమ అభ్యర్థులను బరిలో నిలిపాయి. స్వతంత్రులు కూడా పెద్ద సంఖ్యలోనే ఎన్నికల్లో పోటీలో ఉన్నారు. వీళ్లంతా ఎన్నికల జోరుగా ప్రచారం చేశారు. ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్ వెలువడింది. అప్పటి నుంచే నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. దీంతో వీధి, ఊరూ వాడా ప్రచారహోరుతో మార్మోగిపోయాయి. గల్లీ నాయకులతో పాటు ఢిల్లీ నాయకులు కూడా జిల్లాకు ప్రచారానికి వచ్చారు. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, మాజీ ముఖ్యమంత్రులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు ఇలా ఒకరేంటి చాలా మంది నాయకులు తెగ హడావుడి చేశారు. ఆ పార్టీ ఈ పార్టీ మీద.. ఈ పార్టీ ఆ పార్టీ మీద దుమ్మెత్తి పోసుకున్నాయి. శనివారం సాయంత్రం 6 గంటలతో వీటన్నింటికీ తెరపడింది.

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసులు పలు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా జిల్లా పోలీసులు ముఖ్యమైన ప్రాంతాలలో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. లాడ్జీలు, కల్యాణమండపాలు, గోడౌన్లు, పట్టణ శివారు ప్రాంతాల్లో తనిఖీలు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా చెక్‌పోస్టులు పెట్టి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. 144 సెక్షన్ అమలులోకి వచ్చింది. దీంతో ఎన్నికల ప్రక్రియలో ఒక్కసారిగా ఉత్కంఠ వాతావరణ ఏర్పడిందని చెప్పవచ్చు.



లాడ్జిలో తనిఖీ చేస్తున్న రాయచోటి అర్బన్ పోలీసులు

ప్రజల భూములను కాజేసే చట్టం వద్దు

- టీడీపీ నేతలు ముక్కా కస్తూరి
- గాదెలలో చట్టం ప్రతులు కాల్చి నిరసన
- కూటమి పార్టీలదే ప్రభుత్వం



ప్రచారంలో అరవ శ్రీధర్ , కూటమి నాయకులు

ఓబులవారిపల్లె, మే11 : ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌కు నిరసనగా టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి, మాజీ ఇన్‌చార్జి కస్తూరి విశ్వనాథనాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి అరవ శ్రీధర్ తదితరులు గాదెల గ్రామంలో ప్రచారం నిర్వహించారు. సంబంధిత చట్టం పత్రులను కాల్చివేశారు.ఈ సందర్భంగా నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ముక్కా, మాజీ ఇన్‌చార్జి కస్తూరి భూ హక్కు చట్టంలోని లోపాలు వివరించారు. ఈ చట్టం దేశంలో ఎక్కడా అమలు కాకుండానే జగన్ ప్రభుత్వం అమలు చేసేందుకు 2023 అక్టోబరులో కంకణం కట్టుకుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చట్టంతో రైతులకు తమ భూములపై హక్కులు ఉండవని, దీనికి తోడు కేసులు ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలిపారు. భూ బకాసులు ప్రజల భూములను కాజేసేందుకే ఈ చట్టమన్నారు.. ఈ చట్టంలోని సెక్షన్-5 ప్రకారం టైటిల్ పుస్తకంలో రైతు పేరు కాకుండా టైటిల్ రిజిస్ట్రార్‌కు నచ్చిన పేర్లు నమోదు చేసి భూకబ్జాలు చేస్తారని, దానిని నిరూపించుకునేవరకు డిస్ప్యూట్ రిజిస్టర్‌లో నమోదు చేయడం వల్ల రైతులు ఇబ్బందులు పడతారన్నారు. దీనిపై కోర్టుకు వెళ్లి న్యాయం కోరకుండా ఏవేవో సెక్షన్‌లు అమలు చేస్తున్నారని మండిపడ్డారు. వైసీపీకి ఓటు వేసి గెలిపిస్తే మీ ఆస్తులు, భూములు దొంగల పాలవుతాయని, కాపాడుకోవడానికి కూటమి పార్టీలైన టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కట్టా బాలాజీ, మాజీ ఎంపీపీ వెంకటేశ్వరరాజు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నాయుడోరి రమణ, అజయ్‌బాబు, కల్లా చలపతి, జనసేన రాష్ట్ర నాయకులు జోగినేని మణి, బీజేపీ చంగల్‌రాజు, రామసుబ్బారెడ్డి, రమేష్‌బాబు, టీడీపీ, జనసేన, బీజేపీ మహిళా నాయకురాళ్లు, నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు ఎత్తున పాల్గొన్నారు.

కూటమి దే విజయం : ఎంఆర్‌పీఎస్

రైల్వేకోడూరు: నియోజకవర్గంలో కూటమి బలపరిచిన జనసేన పార్టీ అభ్యర్థి అరవ శ్రీధర్ విజయం కోసం రైల్వేకోడూరు, పెనగలూరు, చిట్వేలి, ఓబులవారిపల్లె, పుల్లంపేట మండలాల్లో శనివారం ముమ్మరంగా ప్రచారం నిర్వహించినట్లు ఎంఆర్‌పీఎస్ నాయకులు వెంబడి రాధాకృష్ణ, నగిరిపాటి చెంగయ్య తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వేకోడూరులో జనసేన పార్టీ అభ్యర్థి విజయం ఖాయమని తెలిపారు. రాజంపేట పార్ల మెంట్ బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపు కోసం వేగవంతంగా ప్రచారం చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు పోలి హరిబాబు, చంటి శేఖర్, తాడి సిద్ధయ్య, కర్రతోటి జనార్దన్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

గెలుస్తున్నాం... : ముక్కా రూపానంద రెడ్డి

ఓబులవారిపల్లి: మనం భారీ మెజారిటీతో గెలిచి అధికారంలోకి వస్తున్నాం అని టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానంద రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని కొర్లకుంట, హరిజనవాడ, చల్లంపాల్లెం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్ గాజు గ్లాసు గుర్తు, రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి కమలం గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం ముక్కా రూపానంద రెడ్డి ఆధ్వర్యంలో 200 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. మంగం పేట నుంచి కొర్లకుంట, చల్లంపాల్లెం వరకు బైక్ ర్యాలీ నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ముక్కా వరలక్ష్మి, ముక్కా శిరీష రెడ్డి, ముక్కా రిషిక రెడ్డి, సీనియర్ నాయకులు కల్లా చలపతి, అనుమలగుండం హరికృష్ణ, కోటూర్ మణి, నరదాసు కృష్ణయ్య కుప్పాల నాగరాజు, మంగరపు నరసింహ, గునిపాటి శివ, పులపత్తూరు సుదర్శన్ రెడ్డి, సిద్దయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



జీవో పత్రాలను దహనం చేస్తున్న అరవ శ్రీధర్, ముక్కా, కస్తూరి

ముమ్మరంగా ఇంటింటి ప్రచారం..

పెనగలూరు: జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్ స్థానిక నాయకులతో కలిసి శనివారం ఇంటింటి ప్రచారం చేశారు. పెనగలూరు అరుంధతివాడ, హరి జన వాడ, ఇండ్లూరు హరిజనవాడ, రాచవారిపల్లి, కుడప అరుంధతివాడలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ కార్యదర్శి షామీర్, కమ్మ సంఘం మండల ప్రధాన కార్యదర్శి పి.నరేష్ బాబు, కొత్త_పల్లి యూనిట్ ఇన్‌చార్జ్ వి.హరిప్రసాద్ రెడ్డి, జిల్లా వాణిజ్య విభాగం కార్యదర్శి ఎన్.మౌరళి, డాక్టర్ రామకృష్ణయ్య, కస్తూరి శివ, జనసేన మండల అధ్యక్షుడు హరి రాయల్, మండల నాయకుడు పి.రాజేష్, బాబురావు, సి.నవీన్, కత్తి శ్రీహరి, పి.ధనయ్య, నవీన్, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

భారీగా చేరికలు..

రైల్వేకోడూరు(రూరల్) మే 11: మండలంలోని ఓబనపల్లె, బయనపల్లె పంచాయతీలు, వివి కండ్రిగ గ్రామంలో టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా, రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి కస్తూరి ఆధ్వర్యంలో జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్ ఉమ్మడి కూటమి నాయకులు ముమ్మర ప్రచారం నిర్వహించారు. వీవీ కండ్రిగలో సూమరు 50 కుటుంబాలు కూటమిలో చేరారు.



కొర్లకుంట హరిజనవాడ గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న ముక్కా వరలక్ష్మి



వైసీపీ కార్యకర్తలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ముక్కా



కూటమిలో చేరిన నాయకులతో ముక్కా రూపానంద రెడ్డి



ఓబులవారిపల్లె మండలంలో ప్రచారం చేస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

మద్యం దుకాణాల వద్ద బారులు



మద్యం షాపుల వద్ద బారులు తీరిన ప్రజలు


ఒంటిమిట్ట, మే11 : సార్వత్రిక ఎన్నికల కారణంగా రెండు రోజులపాటు మద్యం షాపులు మూతపడనున్న నేపథ్యంలో శనివారం మద్యం ప్రియులు దుకాణాల వద్ద బారులు తీరారు. తమకు మద్యం అందుతుందో లేదో.. షాపుకు విధించిన టార్గెట్ అయిపోతుందేమోనని ఉదయం 11గంటలకు ఒంటిమిట్టలోని మద్యం దుకాణం వద్ద బారులు తీరారు. దుకాణం రెండు రోజులకు సరిపోయే మద్యం తీసుకెళ్లేందుకు ప్రయత్నించడంతో క్యూలైన్‌లో తోపులాట చోటు చేసుకుంది. మద్యం లేకుంటే నిద్ర పట్టదని రెండు రోజులపాటు ఇబ్బందులు పడాల్సిందేనంటూ వ్యాఖ్యానించారు.

ఎన్నికల వేళ కూలీలకు డిమాండ్

- అర్ధరాత్రి వరకు ఆరుబయట పడిగాపులు

మదనపల్లె టౌన్, మే 11: ఎన్నికల వేళ కూలీలకు బాగా డిమాండ్ పెరిగింది. అదేంటి ప్రచారాలు అయిపోయాయి కదా ఇంకా కూలీలకు డిమాండ్ ఏమిటను కుంటున్నారా.. అవును నిజమండి మదనపల్లె నియోజకవర్గంలో పలుచోట్ల మల్లిమొగ్గల తోటలు వున్నాయి. ఉదయం వెలుతురు వస్తూనే తోటల్లో దిగే కూలీలు మల్లిమొగ్గలు పీకి 9గంటలకు ఇంటికి చేరుకుంటారు. కాని రెండు రోజులుగా మల్లిమొగ్గలు పీకడానికి కూలీలు సరిగ్గా రావడం లేదని తోటల యజమానులు గగ్గోలు పెడుతున్నారు. దీనికి కారణం ఉందండోయ్.. గత రెండు రోజులుగా రెండు ప్రధాన పార్టీలు ఓటర్ల ఇంటింటి తిరుగుతూ స్లిప్పులు ఇచ్చిన వారికి రూ.2వేల దాకా నగదు అందజేస్తున్నారు. ఒక్కో ఇంట్లో ఎంత మంది ఓటర్లు వుంటే అన్ని రెండు వేలు ఇస్తున్నారు. దీంతో చాలా మంది ఈ నగదు కోసం కూలీ పనులకు కూడా వెళ్లకుండా ఇంటి వద్దనే వుండిపోతున్నారు. అంతే కాదు సుమా..రాత్రి పూట మాత్రమే రాజకీయ నాయకులు నగదు పంపిణీ చేస్తుండటంతో చాలా మంది నిద్ర పోకుండా ఆరుబయట అర్ధరాత్రి వరకు వేచి చూస్తున్నారు. ఓ పార్టీ జోరుగా నగదు పంపిణీ చేస్తుండగా మరో పార్టీ చివరి రెండు రోజుల్లో నగదు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టినట్లు సమాచారం. దీంతో ఊళ్లకు సైతం వెళ్లకుండా ఓటర్లు ఇంటి వద్దనే పడిగాపులు కాస్తున్నారు.

సొంతూళ్లకు వెళ్లేందుకు ప్రయాణికుల పాట్లు



ఆర్టీసీ బస్టాండ్‌లో వేచివున్న ప్రయాణికులు

మదనపల్లి అర్బన్ మే 11 : ఓటు హక్కు వినియోగించుకునేందుకు సొంత ఊర్లకు వెళుతున్న ప్రయాణికులు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బెంగుళూరులో వివిధ ఉద్యోగాల్లో స్థిరపడిన ఏపీ ప్రయాణికులు 13వ తేదీన ఓటు వెయ్యటానికి తమ గ్రామాలకు వెళ్లే బస్సులు అందుబాటులో లేని కారణంగా బస్సు టాప్‌పై ప్రయాణించాల్సి వచ్చింది . ఉదయం నుంచి మదనపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో గంటల కొద్దీ బస్సుల కోసం ప్రయాణికులు నిరీక్షించారు . సుదూర ప్రాంతాల నుంచి సొంతూర్లు చేరుకోడానికి ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు . ప్రభుత్వం ఇలాంటి వారికోసం అధికంగా సర్వీసులను ఏర్పాటు చేయలేకపోయింది. దీంతో చేసేది లేక, కొంతమంది అధిక ధరలు వెచ్చించి ప్రైవేటు వాహనాలలో ప్రయాణం చేశారు . మరికొంతమంది బస్సులలో సీట్లు లేక పోయినా నిలబడి, బస్సు టాప్‌పై కూర్చుని ప్రయాణం చేయవలసి వచ్చింది.

ఎన్నికల సామగ్రి పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

- ఎన్నికల అధికారి మోహన్‌రావు, డీఎస్పీ చైతన్య పరిశీలన

రాజంపేట, మే11 : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి సిబ్బందికి ఇవ్వాల్సిన సామగ్రి పంపిణీకి శనివారం ఏర్పాట్లు పూర్తి చేశారు. పోలింగ్ స్టేషన్ల వారీగా ఇవ్వాల్సిన ఈవీఎంలు, ఎన్నికల మెటీరియల్‌ను సిద్ధం చేశారు. రాజంపేట అన్నమాచార్య డీమ్డ్ యూనివర్సిటీలో పోలింగ్‌స్టేషన్ల వారీగా, సెక్టార్ల వారీగా కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఈవీఎం పంపిణీతో పాటు ఎన్నికల సామగ్రి పంపిణీని పీవో, ఏపీవో ఇతర సిబ్బందికి ఆదివారం ఉదయమే అందజేయనున్నారు. వారికి అందజేసిన ఎన్నికల సామగ్రిని సిబ్బంది పరిశీలించిన తరువాత ఆదివారం మధ్యాహ్నం 41 రూట్‌లకు గానూ 84 బస్సులను ఏర్పాటు చేశారు. 288 పోలింగ్ కేంద్రాలకు ఈ బస్సుల్లో ఎన్నికల సామగ్రిని, సిబ్బందిని పంపనున్నారు. ఇందుకు గానూ 2006 వెబ్‌కాస్టింగ్‌తోపాటు 111 మంది వీడియో గ్రాఫర్లను ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికల ఏర్పాట్లను రిటర్నింగ్ అధికారి మోహన్‌రావు, డీఎస్పీ చైతన్యలు పర్యవేక్షించి సిబ్బందికి తగు సూచనలు చేశారు.



ఎన్నికల సిబ్బంది, సామగ్రి తరలింపునకు సిద్ధం చేసిన బస్సులు

రైల్వేకోడూరులో పోలింగ్ నిర్వహణకు సర్వం సిద్ధం

- ఎన్నికల అధికారిణి లీలారాణి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న లీలారాణి

రైల్వేకోడూరు, మే 11: నియోజకవర్గం లో 13న నిర్వహించే సాధారణ ఎన్నికల కు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేసినట్లు రైల్వేకోడూరు ఎన్నికల అధికారిణి లీలారాణి తెలిపారు. శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ రైల్వేకోడూరు ఎస్సీ-127 నియోజకవర్గం లో పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో మొత్తం 252 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఆదివారం ఉదయం 7 గంటలకు అనంతరాజుపేట ఉద్యాన కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌ను తెరిచి ఎన్నికల సిబ్బందికి ఈవీఎంలు పంపిణీ చేస్తామన్నారు. నియోజకవర్గంలో 1800 మంది సిబ్బంది, 31 మంది సెక్టారు అధికారులు ఉంటారన్నారు. 62 సమస్యాత్మక గ్రామాల్లో మైక్రో అబ్జర్వర్లు, వీడియో గ్రాఫర్స్ ఉంటారన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో నలుగురు, లేదా ఐదుగురు పోలీసులు ఉంటారన్నారు. ఒక అభ్యర్థికి మూడు వాహనాలకు మాత్రమే అనుమతి ఉందన్నారు. పోలింగ్ స్టేషన్లకు 200 మీటర్ల దూరంలోనే వాహనాలు నిలిపివేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయిస్తే తక్షణం ఏర్పాటు చేయడానికి ఈవీఎంలు రిజర్వు చేసి ఉంచామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలకు సాంకేతికపరమైన ఇబ్బందులు వచ్చినప్పుడు బెల్ కంపెనీకి చెందిన ఇంజినీర్లు అందుబాటులో ఉంటారన్నారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు అందుబాటులో ఉంటుందన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో బారికేడ్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఓటర్లు సెల్‌ఫోన్లు ఇంటి వద్దే పెట్టి, ఓటు వేసేందుకు వెళ్లాలన్నారు. 213 ప్రాంతాల్లో వైద్య శిబిరాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఊరి బయట ఉండి స్లిప్‌లు తీసుకోకుండా ఉంటే అలాంటి ఓటరు స్లిప్‌లతో పాటు ఏదైనా ఫొటో గుర్తింపు కార్డుపై బీఎల్‌వో సర్టిపై చేయించుకుని వెళితే ఓటు వేసేందుకు అనుమతిస్తారన్నారు. పోలింగ్ 13న ఉదయం 7 గంటల నుంచి ప్రారంభమై, సాయంత్రం 6 గంటలకు ముగుస్తుందన్నారు. దివ్యాంగులు ఓట్లు వేసుకోవడానికి వీలుగా వీల్‌చైర్స్ ఏర్పాటు చేశారన్నారు. వీల్‌చైర్ ఇంటి నుంచే కావాలనే అనుకునే వారు సాక్ష్యం యాప్ ద్వారా నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. రైల్వేకోడూరులో రెండు మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 170 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఏదైనా సమస్యలు, గొడవలు జరిగినా వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకు సంబంధిం చిన టీవీ ఎన్నికల అధికారి కార్యాలయంలో ఉంటుందన్నారు. గొడవలు చేసిన వారిపై వెంటనే కేసులు నమోదు చేస్తారన్నారు. ప్రజలు తమ ఓట్లను ప్రశాంతంగా వేసుకుని ఇంటికి వెళ్లాలని, అన్ని రాజకీయ పార్టీల నాయకులు ప్రశాంత పోలింగ్ కు సహకరిం చాలన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా పౌర సంబంధాలశాఖ అధికారి నుంచి పాసులు పొందిన జర్నలిస్టులనే పోలింగ్ కేంద్రాల లోపలికి అనుమతిస్తారన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద అల్లర్లు సృష్టిస్తే పీడీ యాక్ట్

- సీఐ జీవన్ గంగనాథ బాబు

లక్కిరెడ్డిపల్లె మే 11 పోలింగ్ కేంద్రాల వద్ద అల్లర్లు సృష్టిస్తే పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తామని లక్కిరెడ్డిపల్లె సీఐ జీవన్ గంగనాథబాబుతెలిపారు. శనివారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో గ్రామ స్థాయి రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలన్నారు, కొత్త వ్యక్తుల సంచారంపై ఫిర్యాదు చేయాలన్నారు. ప్రైవేటు వాహనాల్లో ఓటర్లను తరలించరాదన్నారు. పోలింగ్ ఏజెంట్లు బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్నం భోజనం సమయంలో తప్ప బయటకు రాకూడదన్నారు. ఎస్ఐ విష్ణువర్ధన్ ,ప్రజాప్రతినిదులు ఎంపీటీసీ సభ్యులు,సర్పంచులు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు

రామాపురం: స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో శనివారం సాయంత్రం సీఐ గంగనాథ్‌బాబు, తహసీల్దార్ శ్రీనివాసులు రాజకీయపార్టీల నేతలకు పోలింగ్‌పై అవగాహన కల్పించారు. ఎస్ఐ వీఎల్ ప్రసాద్‌రెడ్డి, ఏఎస్ఐ శ్రీనివాస్‌శర్మ, పోలింగ్ సిబ్బంది, కూటమి నాయకులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

గాలివీడు: ఎన్నికలు సక్రమంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని లక్కిరెడ్డిపల్లె సీఐ జీవన్ గంగానాథ్‌బాబు కోరారు. శనివారం గాలివీడు ఎస్ఐ వెంకటప్రసాద్‌తో కలిసి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వారి ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. శనివారం సాయంత్రం తర్వాత ఓటర్లను ప్రభావితం చేసే విధంగా బహిరంగ సభలు, ఊరేగింపులు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించకూడదన్నారు. ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు చేర్చేందుకు వాహనాలు సమకూర్చకూడదన్నారు. నియోజకవర్గాలతో సంబంధం లేని వ్యక్తులు, ఇతర ప్రాంతాల పార్టీల నేతలు ఎట్టి పరిస్థితుల్లోనూ పోలింగ్ రోజున స్థానికంగా ఉండకూడదని చెప్పారు.



రామాపురం: రాజకీయ పార్టీల నాయకులకు ఎన్నికలపై అవగాహన కల్పిస్తున్న సీఐ జీవన్‌గంగనాథ బాబు, తహసీల్దార్ శ్రీనివాసులు

పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు పూర్తి

గాలివీడు, మే11: మండలంలోని వివిధ గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద అధికారులు పోలింగుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలో 17 గ్రామ పంచాయతీలుండగా 44 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 41,541 మంది ఓటర్లు సోమవారం ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అత్యధికంగా గాలివీడు, నూలివీడు, అరవీడు, గోరాన్‌చెరువు పంచాయతీల్లో 4వేల నుంచి 6 వేలకు పైగా ఓటర్లున్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని అధికారులు ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లకు ఎండ తగలకుండా షామియానాలను ఏర్పాటు చేశారు. తాగునీటి వసతి కల్పించనున్నారు.



నూలివీడులో పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లు

ముగిసిన ప్రచారం, అమల్లోకి ఎన్నికల ఆంక్షలు

రాయచోటిటౌన్, మే11: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అన్నమయ్య జిల్లాలో నెల రోజులుగా హోరెత్తించిన మైకులు ఒక్కసారిగా మూగబోయాయి. ఎన్నికల ప్రచారానికి తెరపడింది. శనివారం సాయంత్రం 5 గంటలతో ప్రచార పర్వానికి తెరపడింది. దీంతో జిల్లా మొత్తం ఒక్కసారిగా ప్రశాంతంగా మారిపోయింది. సోమవారం జరగనున్న ఎన్నికల కోసం తెలంగాణ, కర్ణాటక, హైదరాబాదు తదితర ప్రాంతాల్లో స్థిరపడిన ఓటర్లు తమ ఊర్లకు తరలివస్తున్నారు. అయితే ప్రచారం ముగియడంతో ఆంక్షలు మొదలయ్యాయని జిల్లా కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి అభిషిక్త్‌కిశోర్ తెలిపారు. అన్నమయ్య జిల్లా పరిధిలోని ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆయన సూచించారు. అలాగే ఎన్నికలు ముగిసే వరకు పోలింగ్ కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ఐదుగురికి మించి ఎక్కడైనా గుమిగూడితే చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికలు ముగిసే వరకు రెండు రోజుల పాటు (మే 11 సాయంత్రం 5 గంటల నుండి మే 13 సాయంత్రం 6 గంటల వరకు) వైన్ షాపులు, బార్లు మూసి ఉంచుతారని, లిక్కర్ అమ్మకాలు నిషిద్ధమన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే ప్రయత్నాలు జరుగుతుంటాయని, పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ప్రచారానికి గడువు ముగిసిన దృష్ట్యా ఇకపై ఎన్నికల నిబంధనల మేరకు ఎన్నికల ఊరేగింపులు, ర్యాలీలు, సినిమాలు, టీవీల ద్వారా ప్రచారం నిషిద్ధమన్నారు. మొబైల్స్ ద్వారా ఎన్నికల సందేశాలను పంపించడం, ఒపీనియన్ సర్వేలు చేపడితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే రెండేళ్ల జైలు శిక్ష లేదా భారీ జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉంటుందన్నారు. కావున రాజకీయ నాయకులతో పాటు ఓటర్లు ఈ విషయాన్ని గమనించి ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సహకరించాలని ఆయన సూచించారు.

నేటి నుంచి 144 సెక్షన్ అమలు

పెనగలూరు, మే11 : సార్వత్రిక ఎన్నికల నియమావళిలో భాగంగా ఆదివారం నుంచి ఐదు రోజుల పాటు మండల వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందని పెనగలూరు ఎస్ఐ సుగవాసి చంద్రబోస్ తెలిపారు. బహిరంగ ప్రదేశాలు, కూడళ్లు, షాపుల వద్ద నలుగురు కంటే ఎక్కువ మంది గుమిగూడటం నిషేధమన్నారు. మార్కెట్‌లు, దుకాణాల వద్ద ఏమైనా పనులు ఉంటే చూసుకొని వెంటనే వెళ్లిపోవాలని ఆయన సూచించారు.

చిట్వేలి : ఎన్నికలు జరగనున్న దృష్ట్యా శనివారం సాయంత్రం 6గంటల నుంచి మండలంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని తహశీల్దారు జ్ఞానేశ్వరి శనివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎన్నికల ప్రక్రియకు అంతరాయం కలిగించే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరోధించడానికి ఆంక్షలు విధించినట్లు తహశీల్దారు తెలిపారు. పోలింగ్ కేంద్రాలు, బహిరంగ ప్రదేశాల పరిధిలో 5 మందికి మించి గుమికూడరాదని, సభలు, సమావేశాలు, మతపరమైన సమావేశాలు నిర్వహించరాదన్నారు. ప్రజలందరూ సహకరించాలని తహశీల్దారు కోరారు.

పోలింగ్ కేంద్రాల పరిసరాలు శుభ్రం



రాళ్ల కుప్పలను శుభ్రం చేయిస్తున్న ఏఎస్ఐ మల్లికార్జున వరప్రసాద్

పెనగలూరు, మే 11 : పెనగ లూరు ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాల పరిసరాలను ఏఎస్ఐ మల్లికార్జునవరప్రసాద్ పరిశుభ్రం చేయించారు. పోలిం గ్ రోజున ఓటర్లు స్వేచ్ఛగా వెళ్లి ఓటు హక్కు వినియోగించుకు నేందుకు మార్గాన్ని సుగమం చేశారు. ఓటర్లు తమ ఓటును నిర్భయంగా వినియోగించుకోవచ్చునని ఎస్ఐ సుభాష్ చంద్రబోస్ తెలిపారు. శనివారం సాయంత్రం ఆరు జీపులకు మైకులను ఏర్పాటు చేసి ప్రచారం చేశారు. ఎక్కడైనా, ఎవరైనా అలజడులు సృష్టించేందుకు ప్రయత్నిస్తే కఠినచర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

లాడ్జిలు, కల్యాణ మండపాల్లో విస్తృతంగా తనిఖీలు



లాడ్జీల్లో తనిఖీలు నిర్వహిస్తున్న ఎన్నికల అధికారులు

రాయచోటిటౌన్, మే 11: సార్వత్రిక ఎన్నికలు 2024 నేపథ్యంలో ఎల్లుండి పోలింగ్ దృష్ట్యా ఎలెక్షన్ కమిషన్, జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాలతో రాయచోటి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఆధ్వర్యంలో శనివారం ఎంసీసీ నోడల్ అధికారి, మున్సిపల్ కమిషనర్ వాసుబాబు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, ఏఎస్ఐ జోసెఫ్‌లతో కలిసి రాయచోటి పట్టణంలోని పలు లాడ్జిలు, కల్యాణ మండపాలు, వసతి గృహాల్లో తనిఖీలు చేశారు. రికార్డులను పరిశీలించి బయ టి వ్యక్తులకు గదులు కేటాయించరాదని, అలాంటి వ్యక్తులు ఎవరైనా ఉటే వెంటనే ఎంసీసీ అధికారులు, పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎన్నికల ఆంక్షలు అమల్లో ఉన్నందున ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సుగవాసి ప్రచారం పరిసమాప్తం



ముస్లిం నేతలను కలిసి ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నేత సుగవాసి ప్రసాద్‌బాబు, పోలి సుబ్బారెడ్డి, జనసేన నేత శ్రీనివాసరాజు



బీజేపీ ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని సత్కరిస్తున్న టీడీపీ సీనియర్ నేతలు సుబ్రమణ్యంనాయుడు, వెంకటయ్య నాయుడు



మాజీ మంత్రి రామచంద్రయ్య కుమారుడు, యువనేత చెన్నంశెట్టి విష్ణుస్వరూప్ విస్తృత ప్రచారం



ఎన్నికల నిర్వహణపై చర్చలు జరుపుతున్న మాజీ ఆర్టీసీ చైర్మన్ ఎద్దల సుబ్బరాయుడు, మేడా విజయశేఖర్‌రెడ్డి



సుగవాసి బాలసుబ్రమణ్యంకు స్వాగతిస్తున్న మహిళలు

- ఎన్నికల నిర్వహణపై నేతల దృష్టి
- ఆరు మండలాల నేతలతో సుగవాసి చర్చలు

రాజంపేట, మే 11: సుమారు నెలన్నర రోజులుగా రాజంపేట నియోజకవర్గంలో సాగిన తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం ప్రచారం శనివారం సాయంత్రంతో ముగిసింది. దీంతో ఆయన ఎన్నికల నిర్వహణపై దృష్టి పెట్టారు. నియోజకవర్గంలోని అన్ని బూత్ కమిటీలు, క్లస్టర్ ఇన్‌చార్జిలతో అంతర్గతంగా చర్చించారు. వైసీపీ విచ్చలవిడిగా డబ్బులు పంపిణీ చేయడం, అట్టడుగు వర్గాలపై బెదిరిస్తుండడంతో ఆయా అంశాలపై దృష్టిసారించారు. సోమవారం ఉదయం వరకు అన్ని గ్రామాల్లో ఓటర్లను కలిసి వారిలో నూతనోత్సాహాన్ని నింపాలని బూత్ కమిటీల సభ్యులకు సూచించారు. 13వ తేదీ ఉదయం 6 గంటలకే ఓటర్లను తరలించేందుకు నాయకులు, బూత్ కమిటీ సభ్యులు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఆదివారం టీడీపీ నేతలు, గ్రామ కమిటీలు, బూత్‌కమిటీల సభ్యులు, ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని కోరారు. శనివారం నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ముమ్మరంగా ప్రచారం చేశారు. సుడిగాలి పర్యటన చేసి టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సుండుపల్లిలో బాలసుబ్రమణ్యం తండ్రి మాజీ ఎంపీ సుగవాసి పాలకొండ్రాయుడు ప్రచారం నిర్వహించారు. బ్యాలెట్ పేపర్ చూపుతూ నెంబరు 2లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి తమ కుమారుడు బాలసుబ్రమణ్యంను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు సుండుపల్లి, వీరబల్లి, రాజంపేట మండలాల్లో ప్రచారం నిర్వహించి కొందరు నేతలతో సమావేశమయ్యారు. సుగవాసి బాలసుబ్రమణ్యం బావమరిది మన్నూరు సునీల్, వారి సమీప బంధువులు సుగవాసి జానకిరామ్, శ్రీనివాసులు తదితరులు ఈ ప్రచారాల్లో పాల్గొన్నారు. రాజంపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో సుగవాసి బాలసుబ్రమణ్యం ప్రచారం నిర్వహించారు. ముస్లింలు ప్రచారాల్లో పెద్దఎత్తున పాల్గొన్నారు. క్షత్రియ సామాజిక వర్గం, కమ్మసామాజిక వర్గం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఇతర అన్ని సామాజిక వర్గాల నేతలు స్వచ్ఛందంగా ప్రచారంలో పాల్గొన్నారు. 13వ తేదీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ భారీ మెజారిటీతో గెలుపొందడానికి ఈ ప్రచారాలు ఎంతో తోడ్పడనున్నాయి. చదువురాని వారిని సైతం ప్రచారాల ద్వారా ఆకట్టుకొని వారిని సైకిల్ గుర్తుపై ఓట్లు వేసేలా చర్యలు తీసుకున్నారు. సుగవాసి బాలసుబ్రమణ్యంకు టికెట్టు రాగానే రాత్రింబవళ్లు కష్టించి నియోజకవర్గ ప్రజలను ఆకట్టుకున్నారు.

నియోజకవర్గంలో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, నారా లోకేష్, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, బీజేపీ ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిలు పర్యటించి టీడీపీ కేడర్‌ను ఉత్తేజపరిచి ఎన్నికలకు సమాయత్తం చేశారు. ఈ నియోజకవర్గాన్ని వైసీపీ నేతలు ఎలా విధ్వంసం చేశారో ప్రజలకు కళ్లకు కట్టేట్లు వివరించారు. రాజంపేటను జిల్లా చేస్తామని, అన్నమయ్య ప్రాజెక్టు పునరుద్ధరణ, మెడికల్ కళాశాల ఏర్పాటు ప్రకటించడంతో నియోజకవర్గ ప్రజలు ఒక్కసారిగా ఆనందానికి గురై టీడీపీ వైపు మొగ్గుచూపేలా చేశారు. ఇది 13వ తేదీ ఎన్నికల్లో టీడీపీకి బలమైన ఓట్ బ్యాంక్‌గా మారనుంది. ఇవన్నీ సుగవాసి బాలసుబ్రమణ్యం గెలుపునకు ఎంతో ఉపయోగపడనున్నాయి. స్వచ్ఛందంగా టీడీపీ అభిమానులు, కార్యకర్తలు వారికి వారుగానే బ్యాలెట్ నమూనాలు తయారు చేసుకొని ప్రచార మాధ్యమాల్లో బాలసుబ్రమణ్యంకు ఓట్లు వేసి గెలిపించాలంటూ ప్రచా రం చేస్తున్నారు. ఇటు వైసీపీ వైఫల్యాలు తెలుగుదేశం గెలుపులో కీలక పాత్ర పోషించనున్నాయి. ఈ మేరకు పెద్దఎత్తున సాగిన టీడీపీ ప్రచారాలు ఆ పార్టీ విజయంలో ప్రధాన భూమిక పోషించనున్నాయి. రాజంపేట పట్టణ, రూరల్ ప్రాంతాల్లో మండల పార్టీ అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్య నాయుడు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు డీఆర్‌ఎల్ మణి, కాకతీయ సేవా సమితి జిల్లా అధ్యక్షులు శివన్నారాయణ చౌదరి, కూచివారిపల్లె సీనియర్ నాయకులు వెంకటయ్య నాయుడు, పార్లమెంటు అధికార ప్రతినిధి అజయ్‌బాబు, టీడీపీ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు పొందూరు కొండయ్యనాయుడు, సుబ్రమణ్యంనాయుడు, బాపనయ్యనాయుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గుడారు సుబ్రమణ్యంనాయుడు, దంత వైద్య నిపుణులు డాక్టర్ నవీన్, ప్రముఖ రియల్టర్ కావుటూరి సుబ్రమణ్యంనాయుడు (మణి), బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు కొండూరు శరత్‌కుమార్‌రాజు, టీడీపీ పార్లమెంటు అధికార ప్రతినిధి ప్రతాప్‌రాజు, టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి సుబ్రమణ్యంనాయుడు, గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్.వి.రమణ, భువనగిరిపల్లె నాయకులు టైల్స్ నరసింహ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి చెన్నూరు సుధాకర్, మైనారిటీ నాయకులు గుల్జార్‌బాషా, ఆర్టీసీ మాజీ చైర్మన్ ఎద్దల సుబ్బరాయుడు, మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ ఎద్దల విజయసాగర్, మండల మాజీ అధ్యక్షుడు సుబ్రమణ్యం, నాగిరెడ్డిపల్లె సర్పంచ్ సూరి, ఒంటిమిట్ట మండల సీనియర్ నాయకులు, కల్లుగీత కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కొమరా వెంకటనరసయ్య ప్రచారాల్లో పాల్గొన్నారు.



సుగవాసి బాలసుబ్రమణ్యంకు మద్దతు తెలుపుతూ ఐక్యతారాగాన్ని ఆలపిస్తున్న అన్ని పార్టీల నేతలు

ఒంటిమిట్టలో కూటమి నేతలు ప్రచారం

రాజంపేట టీడీపీ నాయకులతో పాటు మూడు పార్టీల ప్రధాన నాయకులు ఎంతో ఐక్యంగా ప్రచారాల్లో పాల్గొనడం టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంకు, ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపులకు బాగా కలిసివచ్చే అంశం. బీజేపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు సాయిలోకేశ్, రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, బీజేపీ కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడుతో పాటు బీజేపీ నాయకులంతా టీడీపీ అభ్యర్థికి మద్దతు పలికారు. జనసేన పార్టీ నాయకులు శివరామరాజు, నియోజకవర్గ నాయకులు అతికారి కృష్ణ, అతికారి దినేష్, నియోజకవర్గ ఇన్‌చార్జి మలిశెట్టి వెంకటరమణ తమ సంపూర్ణ మద్దతు పలికారు.

కూటమి నేతల ప్రచారానికి విశేష స్పందన

రాజంపేట నియోజకవర్గంలో కూటమి నేతల ప్రచారానికి విశేష స్పందన లభిస్తోంది. వైసీపీ నేతలకు ఎందుకు ఓటు వేయాలని నిలదీస్తూ ఓటర్ల వద్ద తమ గళాన్ని వినిపించారు. రాజంపేటను జిల్లా చేయనందుకా.. అన్నమయ్య డ్యాంను తెంచినందుకా, బాధితులను ఆదుకోనందుకా, నందలూరు ఆల్విన్, లోకోషెడ్డు పరిశ్రమలను పునరుద్ధరించనందుకా అని విమర్శించారు. మెడికల్ కళాశాలను రాకుండా చేసినందుకా అంటూ పలు ప్రశ్నలు వేస్తూ.. అలాంటి వారికి ఎందుకు ఓటు వేయాలని చేస్తున్న ప్రచారానికి మంచి స్పందన లభిస్తోంది. ఇప్పటి వరకు ఒక సిమెంటు రోడ్డు కూడా వేయనందుకా అంటూ వైసీపీ నేతలను ప్రశ్నిస్తూ వారికి ఎందుకు ఓటు వేయాలని నిర్వహించిన ప్రచారాలు టీడీపీకి బాగా కలిసివచ్చాయి.

సుండుపల్లి: ఆంధ్రప్రదేశ్‌లో కూటమి అధికారంలోకి వస్తేనే పేదలందరికీ మంచి జరుగుతుందని రాయచోటి మాజీ ఎంపీ సుగవాసి పాలకొండ్రాయుడు తెలిపారు. శనివారం సుండుపల్లి మండలంలోని మడితాడు, సుండుపల్లి, గుండ్లపల్లి గ్రామ పంచాయతీలలో ఆయన పర్యటించారు. సుగవాసి బాలసుబ్రమణ్యంకు సైకిల్ గుర్తుకు ఓటువేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. రాజంపేట అభివృద్ధి జరగాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జరుగుతున్న అరాచకాలు అక్రమాల నుండి రాష్ట్రం విముక్తి పొందాలంటే చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి శివకుమార్‌నాయుడు, మాజీ సర్పంచ్ రామనాథరెడ్డి, వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి దామోదర్ నాయుడు, చిట్టెం రామచంద్ర, కొయ్యల రామచంద్ర, జనసేన నాయకులు రామ శ్రీనివాసులు, ఎంఆర్‌పీఎస్ నాయకులు రామాంజులు, పెద్ద సంఖ్యలో తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మైనార్టీలు టీడీపీకి ఓటు వేయండి

రాజంపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంను అఖండ మెజార్టీతో గెలిపించాలని తెలుగుదేశం పార్టీ కువైట్ ఉపాధ్యక్షుడు షేక్ బాషా, ఖాదరున్, హర్షద్‌అహ్మద్, ఖాదర్‌వలి, ఆచారి, హబీబ్‌లు కువైట్‌లో ప్రచారం నిర్వహించారు. మైనార్టీలకు న్యాయం జరగాలంటే చంద్రబాబు సీఎం కావాలని వారు పిలుపునిచ్చారు. చరవాణిల ద్వారా కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు సమాచారాన్ని అందజేసినట్లు తెలిపారు. కువైత్‌లో కూడా వారు టీడీపీకి మద్దతుగా ప్రచారం నిర్వహించామన్నారు.

సిద్దవటం: వైసీపీ మాయమాటలు నమ్మి.. మరోసారి నమ్మి మోసపోవద్దని రాజంపేట నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు అతికారి కృష్ణ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని జంగాలపల్లెలో శనివారం ఆయన పర్యటించారు. ఆయనకు రాజంపేట నియోజకవర్గ యువ నాయకులు రాజానాయుడు నేతృత్వంలో పూలమాలతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కుప్పాల వెంకటసుబ్బయ్య, పుత్తారామచంద్రయ్య, అసెంబ్లీ కార్యదర్శి రాజశేఖర్ యాదవ్, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరిస్తాం

మాధవరం-1 గ్రామ పంచాయతీ ఎస్‌కెఆర్ నగర్‌లో జనసేన నాయకుడు అతికారి కృష్ణ టీడీపీ నాయకుడు కుప్పాల వెంకటసుబ్బయ్య ప్రచారం చేశారు. వైసీపీ నాయకుల మాయమాటలు నమ్మి మోసపోవద్దని టీడీపీకి ఓటు వేసి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. రాష్ట్రం బాగుండాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని వైసీపీ పాలనలో ఇసుక దందాలు విపరీతంగా పెరిగిపోయాయని, పేద వారికి ఇసుక ఏ మాత్రం దొరకని పరిస్థితి నెలకొందని వైసీపీని సాగనంపడానికి అందరూ ఓటుతో సిద్ధంగా ఉండాలన్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చాక గ్రామంలో ఏమైనా సమస్యలు అంటే ప్రతి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు.ప్రతి ఒక్కరూ తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బాలసుబ్రమణ్యంను గెలిపించాలని సుండుపల్లెలో ప్రచారం చేస్తున్న మాజీ ఎంపీ పాలకొండ్రాయుడు



మాధవరం-1 గ్రామం ఎస్‌కెఆర్ నగర్‌లో ప్రజలతో మాట్లాడుతున్న జనసేన నాయకుడు అతికారి కృష్ణ



రాజంపేటలో బాలసుబ్రమణ్యంను గెలిపించాలని కరపత్రాలు చూపిస్తున్న కువైట్ మైనార్టీ నాయకులు



సుగవాసి బాలసుబ్రమణ్యంకు మద్దతుగా ప్రచారం నిర్వహించిన టీడీపీ నేత మన్నూరు సునీల్, సంతోష్‌నాయుడు తదితరులు



ఒంటిమిట్టలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ సీనియర్ నేతలు హరిప్రసాద్, సుగవాసి బీసీ నేత రమణ, సుగవాసి శ్రీనివాసులు

ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకోవాలి



కోగటంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్పీ

కమలాపురం రూరల్, మే 11: ప్రజలు ఎలాంటి ప్రలోభాలు, భయానికి లోను కాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఎస్పీ సిద్దార్థ కౌశల్ పిలుపునిచ్చారు. శనివారం కమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో క్రిటికల్ గ్రామాలుగా గుర్తించిన మాచిరెడ్డిపల్లె, దేవరాజుపల్లె, కంచనగారిపల్లె, కోగటం, ఉరుటూరు గ్రామాలను ఎస్పీ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసేందుకు జిల్లా పోలీసుశాఖ అన్ని ఏర్పాట్లను చేస్తుందని, ఎవరి ప్రలోభాలు, బెదిరింపులకు భయపడవద్దని పోలీసుశాఖ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. పోలింగ్ జరిగే సమయంలో ఎవరైనా ఘర్షణలకు దిగడం కానీ పోలింగ్ బూత్‌లలో అల్లరి చేయడం కానీ చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు. కొంత మంది కావాలనే అల్లర్లు సృష్టిస్తారని, ఎవరైనా ప్రలోభాలు, బెదిరింపులకు గురిచేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వల్లూరు ఎస్‌ఐ వెంకటరమణ, కమలాపురం ఎస్‌ఐ రుషికేశవరెడ్డి, వీఎన్‌పల్లె ఎస్‌ఐ వెంకటరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

కోడూరును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

- జనసేన పార్టీ అభ్యర్థి అరవ శ్రీధర్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

రైల్వేకోడూరు, మే 11: 'ఒక్క అవకాశం ఇవ్వండి.. కోడూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తా. 20 ఏళ్లుగా ఒకే పార్టీ వారు అధికారంలో ఉన్నా కోడూరు నియోజకవర్గాన్ని పట్టించుకోలేదు. కనీసం ఆర్టీసీ బస్టాండును అభివృద్ధి చేసుకోలేకపోయారని' రైల్వేకోడూరు జనసేన పార్టీ అభ్యర్థి అరవ శ్రీధర్ తెలిపారు. వివిధ అంశాలపై శనివారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

ప్రశ్న: ఎన్నికల సమరానికి ఎలా సిద్ధమయ్యారు.

జవాబు: బీటెక్ వరకు చదుకున్నా.. ఉద్యోగం చేయకుండా ముక్కావారి పల్లె సర్పంచ్‌గా సేవ చేస్తున్నా. టీడీపీ సూపర్ సిక్స్ పథకాలు, జనసేన ఆశయాలు, సిద్ధాంతాలు ప్రజల్లోకి తీసుకువెళ్లి చైతన్యవంతులను చేశాం. టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పని చేశారు. ముక్కా కుటుంబ సభ్యులందరూ ఎండను సైతం లెక్క చేయకుండా ప్రచారం చేశారు.

ప్రశ్న: మీ ఆశయం..

జవాబు: ప్రజలే దేవుళ్లు, సమాజమే దేవాలయం అన్న ఎన్టీఆర్ ఆశయంతో ప్రజల్లోకి వెళుతున్నాం.

ప్రశ్న: రైల్వేకోడూరు అభివృద్ధిపై..

జవాబు: రైల్వేకోడూరు రాయలసీమలో కోనసీమ. అన్ని వనరులు ఉన్నా అభివృద్ధికి నోచుకోలేదు. 20 ఏళ్లలో వైసీపీ ఎప్పుడూ అభివృద్ధి కార్యక్రమాలను చేసిన పాపాన పోలేదు. ఉద్యాన పంటలకు కేంద్ర బిందువైన రైతుల సంక్షేమానికి ఎవరూ పాటు పడలేదు. శీతలగిడ్డంగులు లేకుండా చేశారు. అప్పాజ్యూస్ పరిశ్రమను పట్టించుకోకుండా వదిలేశారు. కోడూరు-వెంకటగిరి రోడ్డును పెండింగ్‌లో పెట్టేశారు. మంగంపేట ముగ్గురాళ్ల గనుల్లో వేలాది టన్నుల ముగ్గురాయిని దోచుకుని దాచుకున్నారు. రైల్వే అండర్ బ్రిడ్జి, చిట్వేలి-కోడూరు దారి వెడల్పు, గుంజన నదికి రక్షణగోడ, పెనగలూరు మండలంలో సోమశిల బ్యాక్ వాటర్ లిఫ్ట్ ఇరిగేషన్ తదితరాలకు భూమి పూజ చేసి వైసీపీ చేతులు దులుపుకుంది.

ప్రశ్న: ప్రస్తుత ఎమ్మెల్యే ఏం చేశారు ?

జవాబు: సొంత గ్రామాన్నే అభివృద్ధి చేసుకోలేని ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ప్రజలకు ఏం మేలు చేస్తాడు. ఎన్నికల సమయంలో మాత్రం ఉడతా భక్తిగా జీవోలు తెచ్చి ప్రజలను పక్కదారి పట్టిస్తున్నాడు.

ప్రశ్న: ప్రజలు మీకు అవకాశం ఇస్తే..

జవాబు: రైల్వేకోడూరుకు మెడికల్ కళాశాలను తీసుకువస్తా. పెండింగ్‌లో ఉన్న అన్ని సమస్యలను పరిష్కరిస్తా. నాతో పాటు, రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డిని ప్రజలు గెలిపించాలి. ఈ నెల 13న జరిగే పోలింగ్‌లో అభివృద్ధికి బాటలు వేసే ప్రభుత్వాన్ని ప్రజలు ఎంచుకోవాలి.

ఎన్నికల నిర్వహణకు చర్యలు



మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో రిసెప్షన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

కురబలకోట, మే 11: జిల్లాలో ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో స్ట్రాంగ్ రూములను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్ట భద్రతను పకడ్బందీగా ఉంచడంతో పాటుగా ఎటువంటి లోటుపాట్లు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ ప్రాంతంలో గట్టి బందోబస్తును ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్‌కు సంబంధించి సామాగ్రిని పకడ్బందీగా అందజేయాలన్నారు. ఎన్నికలకు సంబంధించి దాదాపుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

కూటమిలో ఐక్యతారాగం

బహుళ నాయకత్వంతో వైసీపీ సతమతం ● రెండు దశాబ్దాల డీసీ ఆధిపత్యానికి గండి
● రెండో వర్గం కూడగట్టుకున్న సమన్వయకర్త విశ్వనాథరెడ్డి

బద్వేలు రూరల్, మే 11: బద్వేలు నియోజకవర్గంలో కూటమి బీజేపీ అభ్యర్థి బొజ్జా రోశన్న నియోజకవర్గ వ్యాప్తంగా ప్రచారాన్ని హోరెత్తిస్తుండగా బహుళ నాయకత్వంతో వైసీపీ కేడరు సతమతం అవుతోంది. బొజ్జా రోశన్నకు మద్దతుగా మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, ఆమె తనయుడు రితీష్ కుమార్‌రెడ్డి, మరో వైపు బీజేపీ, జనసేన నేతలు, రోశన్న సతీమణి అరుణమ్మ, ఆయన కుమారుడు రోషన్ అన్ని మండలాల్లో ప్రచారాన్ని ముమ్మరం చేశారు. వైసీపీలో డీసీ గోవిందరెడ్డి 20 ఏళ్ల ఆధిపత్యానికి గండి కొడుతూ ఆయన బావమరిది నల్లేరు విశ్వనాథరెడ్డిని రెండో సమన్వయ కర్తగా నియమించడంతో బహుళ నాయకత్వం తలెత్తింది. దీంతో వైసీపీలో కేడరు సతమతమవుతోంది.

హోరెత్తుతున్న ప్రచారం

నియోజకవర్గంలో కాశినాయన, కలసపాడు, పోరుమామిళ్ల, బి.కోడూరు, బద్వేలు, గోపవరం, అట్లూరు మండలాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రచారాన్ని హోరెత్తి స్తున్నాయి. అయితే వైసీపీ కంటే కూటమి బీజేపీ అభ్యర్థి బొజ్జా రోశన్న ప్రచారంలో దూసుకెళుతున్నారు. బహుళనాయకత్వం వలన కార్యకర్తలు ఎవరి వద్దకెళితే ఇబ్బందులు తప్పవో తెలుసుకోలేక అధికార పార్టీ ప్రచారం చేసేందుకు ప్రజల్లోకి వెళ్లలేక వెనకంజ వేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. వెళ్లిన చోట వ్యతిరేక గాలులు వీస్తున్నట్లు స్పష్టంగా అధికార పక్షానికి అర్థమవుతోంది.

డీసీ ఆధిపత్యానికి గండి

2004లో దివంగత నేత వైఎస్ఆర్ ఆశీస్సు లతో కాంగ్రెస్ టికెట్ దక్కించుకున్న డీసీ గోవిందరెడ్డి 20 ఏళ్లు ఏకచత్రాధిపత్యంగా నియోజకవర్గాన్ని ఏలాడు. నియోజకవర్గాన్ని 2009లో ఎస్సీగా మార్పు చెందినా 2009, 2014, 2019, 2021 ఉప ఎన్నికల్లో కూడా అప్పటి కాంగ్రెస్, తరువాత వైసీపీ అభ్యర్థులను గెలిపించుకోవడంలో కీలక పాత్ర వహించిన డీసీ గోవిందరెడ్డి 2024 ఎన్నికలు వచ్చేసరికి సొంత వర్గంలోనే తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. వరుసగా బావమరిది అయిన నల్లేరు విశ్వనాథరెడ్డి అసమ్మతి బావుటా ఎగురవేయడంతో పార్టీ అధినాయకత్వం బుజ్జగించి స్వయాన సీఎం వైఎస్ జగన్‌నే నియోజకవర్గానికి రెండో సమన్వయకర్తగా నియమించారు. దీంతో రెండు దశాబ్దాల డీసీ ఆధిపత్యానికి గండి కొట్టినట్లైంది.



బీజేపీ, టీడీపీ, జనసేన నేతలతో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జా రోశన్న



బొజ్జా రోశన్న
బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి



డాక్టర్ సుధ
వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి

వర్గాన్ని కూడగట్టుకుంటున్న నల్లేరు

వరుసకు బావ అయిన ఎమ్మెల్సీ డీసీ గోవింద రెడ్డిపై అసమ్మతిబావుట ఎగురవేసి పార్టీ అధినాయకత్వంతో రెండో సమన్వయకర్తగా నియమించబడిన నల్లేరు విశ్వనాథరెడ్డి నియోజకవర్గంలో తనకంటూ సొంత వర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల్లో వర్గాన్ని కూడగడుతుండడంతో వైసీపీ కేడరులో అందోళన మొదలైంది. కార్యకర్తలు ఎవరి వైపు మొగ్గాలో తెలియని కేడరు తలలు పట్టుక్కూర్చున్నారు. 20 ఏళ్లుగా డీసీ వర్గం కింద కొనసాగిన చాలా మంది నేతలు, కార్యకర్తలు కొంతమేర విశ్వనాథరెడ్డి వర్గంలో చేరగా మరికొందరు ఎటు వెళ్లాలో పాలుపోక నిలబడగా, కొందరు డీసీ వర్గంలోనే కొనసాగుతున్నారు. దీంతో నియోజకవర్గంలో వైసీపీ కేడరులో గజిబిజి పరిస్థితులు నెలకొన్నట్లు తెలుస్తోంది.

కూటమి అభ్యర్థి గెలుపు ఖాయం

టీడీపీ అభ్యర్థిగా ప్రచారాన్ని మొదలుపెట్టిన బొజ్జా రోశన్న కూటమిలో భాగంగా బద్వేలు అసెంబ్లీ స్థానాన్ని బీజేపీకి కేటాయించినా బీజే పీ అభ్యర్థిత్వాన్ని కూడా సాధించుకోవడంలో సఫలీకృతుడైన రోశన్న ఎన్నికల ప్రచారంలో దూసు కెళుతున్నారు. టీడీపీ అభ్యర్థిగా రెండు దఫాలుగా నియోజక వర్గంలో ప్రచారాన్ని ఇదివరకే ముగించుకుని బొజ్జ రోశన్న మూడో దఫా ఎన్నికల ప్రచారంలో ఉత్సాహంగా ముందుకు కదులుతున్నాడు. తన గెలుపుకు ఢోకా లేదన్నది బద్వేలు ప్రజల్లో ఇప్పటికే టాక్ నడుస్తోంది.

ఐక్యతరాగం

బద్వేలు అసెంబ్లీ స్థానాన్ని బీజే పీకి కేటాయిం చడంతో నియోజకవర్గ వ్యాప్తంగా టీడీపీ కేడరు నిరుత్సాహానికి గురైంది. అయితే రోశన్ననే బీజేపీ అధిష్టానం కూడా ఆయనను తమ పార్టీలో చేర్చుకుని ఆయనకే టికెట్ కేటా యించడంతో మళ్లీ కేడరులో ఉత్సాహం మొదలైంది. దీంతో టీడీపీ అగ్రనేతలు మొదలు అటు జనసేన, ఇటు బీజేపీ కేడరుతో సమన్వయంతో ముందుకు సాగుతూ ఐక్యతరాగంతో ప్రచారాన్ని హోరెత్తిస్తూ వైసీపీ కేడరును టీడీపీలో చేర్చుకోవడంలో సఫలీకృతులు కావడంతో కూటమి నాయకత్వం అంతా ఎన్నికల్లో ఉత్సాహంతో ఉరకలేస్తున్నారు. కూటమి నాయకత్వం అంతా ఐకమత్యంగా పనిచేస్తుండడంతో నియోజకవర్గంలో మూడు పార్టీల కేడరులో ఉత్సాహం నెలకొంది.

వైసీపీ కోటలకు బీటలు

● రసకందాయంలో రైల్వేకోడూరు రాజకీయం
● విజయ పథాన శ్రీధర్





రైల్వేకోడూరు, మే 11: సుమారు 20 ఏళ్ల అగ్రపథాన నిలిచి పెట్టని కోటై నిలిచిన కాంగ్రెస్, వైసీపీ కోటకు బీటలు బారాయి. 1983 నుంచి 1999 వరకు టీడీపీకి పట్టం కట్టిన ప్రజలు జగన్ సీఎంగా ఇచ్చిన హామీలను నెరవేర్చక పోవడంతో వైసీపీని ప్రజలు ఇంటికి పంపనున్నారు. ఫలితంగా రైల్వేకోడూరు రాజకీయం రసకందాయంగా నడుస్తోంది. నియోజకవర్గంలో కూటమి నేతలు పట్టుబిగించడంతో విజయం వైపు జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్ ఉన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీపై ఉన్న వ్యతిరేకత, ఇసుక మాఫియా, భూదందాలు, దాడులు, ప్రజావ్యతిరేక పాలన, మద్యం తదితర కారణాలతో ప్రజల్లో మార్పు వచ్చింది. దీంతో కూటమి బలపరిచిన అభ్యర్థి అరవ శ్రీధర్‌కు ప్రజలు పూర్తి మద్దతు పలుకుతున్నారు. జనసేన గెలుపును టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి తన భుజస్కందాలపై వేసుకుని ముమ్మరంగా ప్రచారం చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు, రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్, టీడీపీ, బీజేపీ, జనసేన మండల నేతలు, బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నేతలు ప్రచారాన్ని వేగవంతం చేసి శ్రీధర్ గెలుపు కోసం సైనికుల్లా పని చేస్తున్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు షణ్ముఖ వ్యూహంతో ముందుకు సాగుతున్నారు. అయితే ఉమ్మడి కడప, నెల్లూరు జిల్లాల మధ్య దూరాన్ని తగ్గించాలని 30 ఏళ్ల కిందట ప్రారంభించిన రైల్వేకోడూరు-వెంకటగిరి రోడ్డు నిర్మాణం చేపడతామని వైసీపీ ప్రకటనలు పేపర్లకే పరిమితమవడం, అప్ప జ్యూస్ కర్మాగారం ఇంత వరకూ ప్రారంభం కాకపోవడాన్ని ప్రచారాస్త్రంగా మార్చుకుని వైసీపీని ఓడించడానికి ఒక ప్రణాళిక బద్ధంగా అడుగులు వేశారు. రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పుల్లంపేట, పెనగలూరు మండలాల్లో వైసీపీ కోటల్లో పావులు కదిపి బీటలు పడేలా చేశారు. కీలక నేతలు, కార్యకర్తలను టీడీపీలోకి చేర్చుకోవడంలో కృతార్థులవగా, మరికొందరు స్వచ్ఛందంగా పార్టీలో చేరారు. కూటమి నేతలు, కార్యకర్తలు కలసి కట్టుగా పని చేయడంతో జనసేన అభ్యర్థి గెలుపు సులభతరమైంది. వైసీపీలో అంతర్గత విభేదాలు, ఐదేళ్లలో నేతలు, కార్యకర్తలను ఎమ్మెల్యే పట్టించుకోకపోవడం, ప్రభుత్వంపై ప్రజలు వ్యతిరేకంగా ఉండడం, ప్రజా విధానాలు సక్రమంగా లేకపోవడం, అభివృద్ధి కార్యక్రమాలు అమలులో విఫలం కావడం, అసెంబ్లీలో రైల్వేకోడూరు సమస్యలపై చర్చించక పోవడం, మండలాల్లో కొందరి నేతలను దగ్గరకు తీసుకోకపోవడంతో జనసేనకు లాభం చేకూరింది. వైసీపీలో నేతలు, కార్యకర్తల్లో తీవ్ర అసంతృప్తి నెలకొనడంతో జనసేన అభ్యర్థి గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వైసీపీ తరఫున పోటీ చేసిన కొరముట్ల శ్రీనివాసులు నాలుగు పర్యాయాలు గెలుపొందారు. అయితే జగన్ తీరుతో ఐదోసారి ఎమ్మెల్యేగా గెలుస్తారని విశ్వాసం కోల్పోయింది. ఇది కూటమికి కలసి వచ్చేలా మార్చుకుని టీడీపీ, బీజేపీ, జనసేన సమష్టిగా పని చేస్తున్నాయి. జనసేన భారీ మెజార్టీతో గెలుస్తుందని రాజకీయ మేధావులు అభిప్రాయపడుతున్నారు. కోడూరులో వైసీపీ వెంటిలేటర్‌పై ఉండడం కొసమెరుపు.



రైల్వేకోడూరు-వెంకటగిరి ప్రస్తుత రోడ్డు దుస్థితి

వివేకా హత్య.. ముంచుతుందా?

● అందరి చూపూ పులివెందుల వైపు!
● మూడోసారి బరిలో వైఎస్ జగన్
● టీడీపీ నుంచి బీటెక్ రవి
●ఎంపీ అవినాశ్‌రెడ్డికి వ్యతిరేకంగా షర్మిల, సునీత విస్తృత ప్రచారం
● భర్త తరఫున తిరిగిన వైఎస్ భారతీరెడ్డి

(కడప, ఆంధ్రజ్యోతి): రాష్ట్రం యావత్తూ కడప వైపు చూస్తోంది. సీఎం జగన్మోహన్‌రెడ్డి చిన్నాన్న, మాజీ మంత్రి వైఎస్ వివేకా నందరెడ్డి హత్యోదంతం వరుసగా ఈ ఎన్నికల్లోనూ ప్రధాన ప్రచారాస్త్రం కావడమే దీనికి కారణం. పైగా వైఎస్ కుటుం బం తొలిసారి రెండుగా చీలిపోయింది. వైఎస్ జగన్ పులి వెందుల అసెంబ్లీ బరిలో నిలవగా.. ఆయన చెల్లెలు, పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి కాంగ్రెస్ తరఫున కడప లోక్‌సభ స్థానానికి పోటీచేస్తున్నారు. జగన్ మరో చిన్నాన్న భాస్కర్‌రెడ్డి, ఆయన కుమారుడు, ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి వివేకా హత్య కేసులో నిందితులుగా ఉన్న సంగతి తెలి సిందే. అవినాశ్‌కు జగన్ మళ్లీ కడప లోక్‌సభ టికెట్ ఇవ్వడం వల్లే తాను ఆయనపై పోటీకి దిగానని షర్మిల చెబుతున్నారు. ఆమె తరఫున వివేకా కుమార్తె సునీత కూడా ప్రచారం చేస్తున్నారు. వివేకాను హత్యచేసిన వారిని పార్లమెంటుకు పంపొద్దని ఆమె, షర్మిల కొంగు బట్టి మరీ ప్రజ లను అడుగుతుండడం.. ఇది సెంటి మెంటుగా మారడంతో జగన్ ఇరకాటంలో పడ్డారు. ఆయన తరఫున ఆయన భార్య వైఎస్ భారతీరెడ్డి ప్రచారం నిర్వహించారు. ఇక్కడ టీడీపీ తరఫున మాజీ ఎమ్మెల్సీ మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి), కాంగ్రెస్ అభ్యర్థిగా ఎం.ధ్రువకుమార్ రెడ్డి, వివేకా హత్య కేసులో అప్రూవర్‌గా మారిన డ్రైవరు దస్తగిరి కూడా ఎన్నికల బరిలో పోటీ చేస్తున్నారు.

వైఎస్ కుటుంబానికి కంచుకోట..

పులివెందుల వైఎస్ కుటుంబానికి కంచుకోట. 1978 నుంచి ఆ కుటుంబ సభ్యులే గెలుస్తూ వస్తున్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 1978లో తొలిసారి కాంగ్రెస్ తరఫున ఇక్కడ విజయం సాధించారు. 1983, 85ల్లోనూ ఆయనే గెలిచారు. 1989లో కడప ఎంపీగా నెగ్గారు. ఆయన తమ్ముడు వివేకానంద రెడ్డి పులివెందుల ఎమ్మెల్యేగా గెలిచారు. మధ్యలో ఆయన రాజీనామా చేయడంతో 1991లో జరిగిన ఉప ఎన్నికలో వారి పెదనాన్న వైఎస్ పురుషోత్త మరెడ్డి బరిలోకి దిగి విజయం సాధించారు. 1994 లో వివేకానందరెడ్డి మరోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. ఇక 1999, 2004, 2009ల్లో రాజశేఖర్‌రెడ్డి హ్యాట్రిక్ కొట్టారు. 2009 సెప్టెంబరులో హెలీకాప్టర్ ప్రమాదంలో ఆయన మరణం తర్వాత 2010లో జరిగిన ఉప ఎన్నికలో ఆయన భార్య వైఎస్ విజయలక్ష్మి ఏకగ్రీవంగా అసెం బ్లీకి ఎన్నికయ్యారు. 2011 ఉప ఎన్నికలో వైసీపీ తరఫున ఆమె, కాంగ్రె స్ నుంచి వివేకానందరెడ్డి పోటీ చేయగా.. విజయలక్ష్మి విజయం సాధించారు. 2014, 19ల్లో జగన్ గెలిచారు. మూడోసారి బరిలో నిలిచారు. వివే కా హత్య, జగన్ ఒక్క చాన్స్ అని అడగడం 2019 ఎన్నికల్లో ప్రభావం చూపాయి. ఈ పర్యాయం వివేకా హత్య విషయం జగన్‌కు రివర్స్ అవుతుందనే ప్రచారం సాగుతోంది. రాజశేఖర్‌రెడ్డి ఉన్నప్పుడు ఆయన రాష్ట్ర రాజకీయాలు చూసుకుంటే.. వివేకా కడప జిల్లా రాజకీయాలు చూసేవారు. ఎప్పుడూ పులివెందులలో అందరికీ అందుబాటులో ఉండేవా రు. చిన్న పిల్లలు పిలిచినా పలికే మనస్తత్వం కలిగిన వివేకాను దారుణంగా హత్య చేశారు. 2019 ఎన్నికల్లో ఆయన అనుచరులంతా వైసీపీ గెలుపు కోసం పనిచేశారు. అనంతరం జరిగిన సీబీఐ దర్యాప్తులో ఈ హత్యలో అవినాశ్ కుటుంబం పాత్ర ఉన్నట్లు సీబీఐ నిర్ధారించడంతో వారంతా ఇప్పుడు సైలెంట్ అయిపోయారు. 2019లో వివేకా పెద బావమరిది నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డి లింగాల, సింహాద్రిపురం మండలాలకు ఇన్‌చార్జిగా వ్యవహరించారు. రెండు మండలాల్లో వైసీపీకి భారీ మెజా రిటీ వచ్చింది. వివేకా వ్యక్తిగత జీవితంపై జగన్ దాడి చేయడంతో శివప్రకాశ్‌రెడ్డి ఈ ఎన్నికల్లో ఆయన వైసీపీకి దూరంగా ఉన్నారు. దరిమిలా ఆ రెండు మండలాల్లో వైసీపీ ఓట్లకు భారీగా గండి పడే అవకాశం ఉంది. నియోజకవర్గ వ్యాప్తంగా వివే కా అనుచరులు గుంభనంగా ఉండడం.. సునీత విస్తృతంగా పర్యటిస్తూ తన తండ్రి హత్యకు న్యాయం చేయాలని కోరుతుండడంతో జగన్ అండ్ కోకు బెంగ పట్టుకుంది. ఇంకో వైపు.. టీడీపీ అభ్యర్థి బీటెక్ రవి క్రమంగా నియోజకవర్గంలో పట్టు సాధిస్తున్నారు. 2011 ఉప ఎన్నికలో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓ డిపోయిన ఈయ న.. 2014లో జ రిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో వివే కాపై విజయం సాధించడం సంచలనం రేపింది. వైఎస్ కుటుం బానికి అదే తొలి ఓటమి కావడం గమనార్హం.



వైఎస్ జగన్ మోహన్ రెడ్డి

జగన్ మోహన్‌రెడ్డి బలాలు

- వైఎస్ కుటుంబానికి ఎదురులేకపోవడం
- సీఎం హోదాలో నియోజకవర్గానికి భారీ ఎత్తున నిధుల కేటాయింపు.
- పార్టీ ముఖ్యులకు కాంట్రాక్టు పనులు..
- దాదాపు అన్ని వర్గాలూ తనవైపే ఉన్నారన్న ధీమా.
- ద్వితీయ శ్రేణి నేతల విస్తృత ప్రచారం.

బలహీనతలు..

- తల్లి, చెల్లిని మెడబట్టి బయటకు నెట్టారన్న ప్రచారం.
- వివేకా హత్య కేసులో నిందితులకు అండగా నిలవడం..
- అవినాశ్‌రెడ్డికి మళ్లీ ఎంపీ టికెట్ ఇవ్వడం..
- ఆయనపై షర్మిల పోటీకి దిగడం..
- విజయంపై ఢోకా లేకున్నా లోక్‌సభ స్థానానికి క్రాస్ ఓటింగ్ జరిగి.. షర్మిలకు ఓట్లు వేస్తారేమోనన్న ఆందోళన..

బీటెక్ రవి బలాలు

- టీడీపీ కేడర్ బలంగా ఉండడం..
- ఆరేడు నెలలు ముందుగానే నియోజకవర్గమంతా విస్తృత పర్యటన..
- పలువురు వైసీపీ ద్వితీయ శ్రేణులను టీడీపీకి తీసుకురావడంలో సఫలం.
- వివేకా హత్య కేసులో జగన్ తనపైనే ఆరోపణలు చేసినా అవి తప్పని సీబీఐ దర్యాప్తులో తేలడం..
- జగన్ ప్రభుత్వం పెట్టిన పలు తప్పుడు కేసులతో సానుభూతి.
- ఈ సారి జగన్‌కు షర్మిల సవాల్ విసురుతుండడం..
- వైసీపీ ఓట్లు చీలతాయన్న నమ్మకం.

బలహీనతలు..

- కేడర్‌లో అందరికీ అందుబాటులో లేకపోవడం...
- టీడీపీ ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డితో కలిసికట్టుగా ప్రచారం నిర్వహించకపోవడం.

ప్రజలకు జగన్ దూరం..


రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉండగా పులివెందులలో ఎలాంటి ఆంక్షలు లేకుండా తిరుగుతూ జనంతో మమేకమయ్యే వారు. వివేకా ఎప్పుడూ జనంతోనే తిరిగేవారు. జగన్ మాత్రం రివర్స్. సీఎం అయ్యాక పులివెందులకు ఎప్పుడు వచ్చినా బారికేడ్లు, పరదాలు, అత్యంత భారీ బందోబస్తు మధ్య పర్యటన చేస్తుంటారు, ఎంపిక చేసుకున్న వారినే కలుస్తారు. ఇడుపులపాయ వెళ్లిపోవడం తప్ప జనంతో మమేకమవడం లేదు. పులివెందుల బాధ్యతలు మొత్తం వైఎస్ అవినాశ్‌రెడ్డికే అప్పగించడంతో ఏ సమస్య ఉన్నా జనం ఆయన వద్దకే వెళ్లాల్సిన పరిస్థితి. ఆయన ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నా జనం సమస్యలు పరిష్కారం కావడం లేదన్న విమర్శలున్నాయి. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోను, అధికారుల వద్ద ఆయన వర్గీయుల మాటే చెల్లుబాటవుతోంది. దీనికి తోడు పులివెందులలో భూకబ్జాలు, బలవంతపు వసూళ్లు ఎక్కువయ్యాయి. వైసీపీ ముఖ్య నేతల అండదండలతోనే ఇవన్నీ జరుగుతున్న నేపథ్యంలో ఎవరి వద్దకు వెళ్లాలో ప్రజలకు తెలియని పరిస్థితి. పోలీసు స్టేషన్‌కు వెళ్లినా ప్రయోజనం ఉండదని అడిగిన మొత్తం ఇచ్చేస్తున్నట్లు బాధితులు అంటున్నారు. చక్రాయపేట మండలానికి వైసీపీ ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డి ఉన్నారు. మండలంలో జాతీయ రహదారి పనులకు సంబంధించి ఈయన డబ్బు డిమాండ్ చేశారని కాంట్రాక్టర్ ఫిర్యాదు చేయడంతో గతేడాది కొండారెడ్డిని పోలీసులు కొన్ని నెలలు జిల్లా బహిష్కరించారు. పులివెందులలో కొందరు సాక్షాత్తు కలెక్టర్ సంతకాన్నే ఫోర్జరీ చేసి భూములను ఆక్రమించారని కేసు నమోదైంది.



బీటెక్ రవి

రూ.500 నోటు హల్‌చల్

సార్వత్రిక ఎన్నికల్లో కట్టలు తెగిన కరెన్సీ ● నగదు పంపిణీ షురూ ● చిందేసిన కరెన్సీ



బద్వేలు, మే11: ఓటరును ప్రలోభాలకు గురిచేసిందెవరో కానీ ఆయనకో దండం పెట్టాలి. ఇప్పుడు మర్రిచెట్టు ఊడల్లా పెనవేసుకుని పోయింది. శనివారం సాయంత్రం ఐదు గంటలకు ప్రచారం ముగిసింది. అయితే ఇప్పటికే ప్రలోభాల పర్వానికి తెరదీశారు. దీంతో నాయకుల చేతుల్లో వందల మేరకు రూ.500 కరెన్సీ తీసుకుని బయలు దేరారు. ఎక్కడ చూసినా రూ. 500 నోటు చిందేస్తోందని చెప్పవచ్చు. నియోజకవర్గంలో యంత్రాంగం పోలింగ్‌కు సమాయత్తమవుతోంది. అభ్యర్థులు ఎన్నికల నిర్వహణ మొదలు పెట్టారు. నాయకులు నియోజకవర్గాల్లో నగదు పంపిణీకి శ్రీకారం చుట్టారు. శుక్రవారం ఓటర్లకు నగదు పంపిణీ మొదలైంది. భారీగా డబ్బులేనిదే ఎన్నికలు లేవనేది వాస్తవం. ఎన్నికల వేళ కోట్లు నేతలు ఖర్చు చేస్తున్నారు. బద్వేలు నియోజకవర్గంలో టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులు వైసీపీ, కాంగ్రెస్ పార్టీలు సైతం తమదైన రీతిలో ప్రచారం నిర్వహించారు. అధికారం దక్కించుకోవాలని ఎవరికి వారు పోటాపోటీగా ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో వైసీపీ నేతలు ఎలాగైనా విజయం సాధిం చాలని విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు చేస్తున్నారు. ఈ సారి ఎన్నికల్లో డబ్బు, మద్యం ఏరులై పారిందనేదాంట్లో ఎలాంటి సందేహం లేదు. ఎమ్మెల్యేగా పోటీలో ఉన్న అభ్యర్థి రూ.40 లక్షలు, ఎంపీగా బరిలో ఉన్న అభ్యర్థులు రూ.95 లక్షలకు మించి ఖర్చు చేయకూడదని నిబంధన ఉండగా ఈ ఖర్చులు రికార్డులకే పరిమితమవుతాయన్న వాస్తవం జగమెరిగిన సత్యమని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. బహిరంగ సభలు, రోడ్‌షోలు, రోజు వారి కార్యకర్తల ఖర్చులు , పార్టీ కార్యక్రమాల నిర్వహణ ప్రచార ఖర్చులు ఇలా అన్నీ కలిసి అంచనాలు దాటుతాయి. ఒక్క నామినేషన్ రోజు చేసిన ఖర్చే అతని స్థాయి తెలుస్తోంది. అభ్యర్థి ఎవరైనా సరే నోటు ఇవ్వాల్సిందేనని జనం పట్టుబడుతున్నారు. అభిమానం వేరు... ఓటు విలువ వేరు అని తేల్చేస్తున్నారు. ఇంతకాలం ఈలలు కొడుతూ, డ్యాన్స్‌లు వేసిన కార్యకర్తలు కూడా డబ్బుకోసం వెంపర్లాడుతున్నారు. ఇప్పటికే వైసీపీకి చెందిన వారు రూ.1500 నుంచి 2 వేల వరకు ఓటర్లకు పంపిణీ చేస్తున్నట్లు సమాచారం. ఈ ఎన్నికల్లో డబ్బు పంపిణీ ప్రభావం మరీ ఎక్కువగా కనిపిస్తోంది. ఓటర్ల నాడి చిక్కక నేతలు తలలు పట్టుకుంటున్నారు.

అన్నమయ్య జిల్లాలో పోలింగ్ కేంద్రాలు ఇవే

రాయచోటిటౌన్, మే11: జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అన్నమయ్య జిల్లా లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 1609 పోలింగ్ కేంద్రాలు ఉండగా అందులో 125- రాజంపేట నియోజకవర్గంలో 288 కేంద్రాలు, 127-కోడూరు నియోజకవర్గంలో 252 కేంద్రాలు, 128-రాయచోటి నియోజకవర్గంలో 292 కేంద్రాలు, 162-తంబళ్లపల్లె నియోజకవర్గంలో 236 కేంద్రాలు, 163-పీలేరు నియోజకవర్గంలో 281 పోలింగ్ కేంద్రాలు, 164-మదనపల్లె నియోజకవర్గంలో 260 కేంద్రాల చొప్పున మొత్తం 1609 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. రాయచోటి నియోజక వర్గం మొత్తం పోలింగ్ 292 కేంద్రాల్లో మండలాల వారీ పోలింగ్ కేంద్రాల వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటి మండలంలో 32 పోలింగ్ కేంద్రాలు, లక్కిరెడ్డిపల్లె మండలంలో 33 పోలింగ్ కేంద్రాలు, చిన్నమండెం మండలంలో 32 పోలింగ్ కేంద్రాలు, గాలివీడు మండ లంలో 44 పోలింగ్ కేంద్రాలు, సంబేపల్లె మండలంలో 36 పోలింగ్ కేంద్రాల చొప్పున ఉండగా అందులో ఎన్నికల అధికారులు అన్ని రకాల ఏర్పాట్లను పూర్తి చేశారు.

పోలింగ్ రోజు మాక్ పోల్

మైదుకూరు, మే 11: పోలింగ్ రోజు 13న సోమవారం రోజు ప్రతి పోలింగ్ కేంద్రంలో మాక్ పోల్ నిర్వహిస్తారు. పోలింగ్ ప్రారంభం కావడానికి 90 నిమిషాల ముందు పోలింగ్ ఏజంట్ల సమక్షంలో అధికారులు ఈ మాక్ పోల్ నిర్వహిస్తారు. ఇందులో 50 ఓట్లు వేయడం ద్వారా నోటా సహా పోటీలో ఉన్న ప్రతి అభ్యర్థి నమోదైన ఓట్లను నిర్ధారి స్తారు. కంట్రోల్ యూనిట్ ఎలక్ట్రానిక్ ఫలితాలు, వీవీ ప్యాట్ స్లిప్‌ల కౌంట్‌ను ఏజెంట్ల సమక్షంలోనే లెక్కించి చూపిస్తారు. ఈ మాక్ పోల్‌లో ఈవీఎంలో ఏమైనా తేడా ఉంటే మారుస్తారు. అన్నీ సక్రమంగా ఉంటే విజయవంతగా నిర్వహించినట్లుగా ప్రిసైడింగ్ ఆఫీసర్ రిపోర్టులో సర్టిఫికెట్‌ను పొందు పరుస్తారు. మాక్ పోల్ ప్రక్రియ ముగిసిన వెంటనే ఆ డేటాను క్లియర్ చేసేందుకు కంట్రోల్ యూనిట్‌లోని క్లియర్ బటన్ నొక్కుతా రు. మాక్ పోల్ ఓట్లను తొలగించిన తర్వాత సీయూలో ఓట్లు నమోదు కాలేదన్న విషయాన్ని అక్కడి పోలింగ్ ఏజెంట్లకు ప్రదర్శించి చూపుతారు. ఈ మాక్ పోల్ స్లిప్‌లను వీవీ ప్యాట్ స్లిప్ కంపార్టుమెంట్ నుంచి బయటకు తీసి వాటిని మాక్ పోల్ స్లిప్ అని స్టాంప్ వేస్తారు. అసలైన పోలింగ్ ప్రారంభానికి ముందుకు ప్రత్యేకంగా సీలు వేసిన నలుపు కవర్‌లో మాక్ పోల్ స్లిప్‌లను ఉంచి పోలింగ్ ఏజంట్లకు చూపుతారు. పోలింగ్ ఏజంట్ల సమక్షంలో ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లకు సీలు వేస్తారు. అసలు పోల్ ప్రారంభించే ముందు సీళ్లపై ఏజెంట్ల సంతకం తీసుకుంటారు.

పోలింగ్ కేంద్రం, బూత్ ఒక్కటి కాదా

కలికిరి, మే 11: ఎన్నికల్లో ఓటింగ్ ప్రక్రియ జరిగే ప్రదేశాన్ని పోలింగ్ కేంద్రం లేదా పోలింగ్ బూత్ అని పిలవడం పరిపాటి. అయితే పోలింగ్ కేంద్రానికి, పోలింగ్ బూత్‌కు వ్యత్యాసముంది. ఓటింగ్ కంపార్ట్‌మెంటును ఏర్పాటు చేసే గదిని మాత్రమే పోలింగ్ బూత్ అంటారు. ఇలాంటి ఒక బూత్‌గానీ, కొన్ని బూత్‌లుగానీ ఏర్పాటు చేసే ప్రాంతాన్ని పోలింగ్ కేంద్రం అని వ్యవహరిస్తారు. ఉదాహరణకు ఒక జడ్పీ హైస్కూల్‌లో తరగతుల వారీగా కొన్ని బూత్‌లు ఏర్పాటై వుంటాయనుకుంటే. ఫలానా జడ్పీ హైస్కూల్ 10 తరగతి గదిలో ఫలాన నంబరుతో బూత్‌ను ఏర్పాటు చేస్తారు. ఈ జడ్పీ హైస్కూల్‌లో ఒకటే కాకుండా మరిన్ని పోలింగ్ బూత్‌లు ఉండొచ్చు. ఇక్కడ జడ్పీ హైస్కూల్‌ను పోలింగ్ కేంద్రం గాను, బూత్ ఏర్పాటైన గదిని పోలింగ్ బూత్ గానూ వ్యవహరిస్తారు.

ఓటర్లకు ఇబ్బంది కలగకూడదు

కడప(కలెక్టరేట్) మే 11: ఓటింగ్ కోసం ఇతర ప్రాంతాల నుంచి జిల్లాకు వచ్చే స్థానిక ఓటర్లకు చెక్ పోస్టుల వద్ద ఎలాంటి ఇబ్బందులు పెట్టకుండా ఓటరు గుర్తింపు కార్డును చూసి జిల్లాలోకి అనుమతించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 13న ఓటింగ్ ప్రక్రియ కోసం వచ్చే ఓటర్లకు ఇబ్బందులు ఎదురైతే టోల్ ఫ్రీ నెంబరు 08562-315672కు కాల్ చేయాలని తెలిపారు.

ఎన్నికల సామగ్రి తరలింపులో అజాగ్రత్త వద్దు

●పొరపాట్లకు తావివ్వకుండా జాగ్రత్త వహించండి ● ఎన్నికల అధికారులు, సిబ్బందికి కలెక్టర్ సూచన ●మదనపల్లె, కురబలకోట, గుర్రంకొండ పోలింగ్ కేంద్రాల పరిశీలన

మదనపల్లె టౌన్, మే 11: ఎన్నికల్లో పోలింగ్‌కు అవసరమైన సామగ్రి తరలింపు, తీసుకురావడంలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పక్కాగా విధులు నిర్వహించాలని ఎన్నికల అధికారులు, సిబ్బందికి కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ సూచించారు. శనివారం స్థానిక జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్లను, స్ట్రాంగ్ రూమ్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాలను బట్టి ఎన్ని కౌంటర్లు ఏర్పాటు చేశారు. స్ట్రాంగ్ రూమ్ నుంచి ఈ కౌంటర్లకు ఈవీఎంలు తరలింపునకు ఎంత మంది సిబ్బందిని కేటాయించారు తదితర అంశాలపై రిటర్నింగ్ అధికారి హరిప్రసాద్‌తో చర్చించారు. అలాగే పోలింగ్ కేంద్రాల వద్ద బ్యారికేడ్లు ఏర్పాటు చేయడం, ఓటర్లకు తాగునీరు, నీడ సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. దివ్యాంగులకు పోలింగ్ కేంద్రాల వద్ద వీల్ చైర్లు ఏర్పాటు చేయాలన్నారు. రిటర్నింగ్ అధికారి హరి ప్రసాద్ మాట్లాడుతూ డిస్ట్రిబ్యూషన్ కోసం 34 కౌంటర్లు ఏర్పాటు చేశామని, ప్రతి కౌంటర్‌లో నలుగురు డిస్ట్రిబ్యూషన్ సిబ్బంది ఉంటారన్నారు. పోలింగ్ సిబ్బంది ఆదివారం ఉదయం 6గంటలకే డిస్ట్రిబూషన్ సెంటర్‌కు చేరుకుంటారని, వారికి భోజనవసతులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మదనపల్లె నియోజకవర్గంలో మొత్తం 48 రూట్లలో బస్సులు రూట్‌మాప్ ఆధారంగా పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని, ఎన్నికల సామగ్రిని తీసుకెళతాయన్నారు. సెక్టోరియల్ అధికారులు సమక్షంలోనే ఈ బస్సులు వారికి కేటాయించిన రూట్లలో వెళ్తాయన్నారు. ప్రతి బస్సుకు పోలీసులు ఎస్కార్ట్‌గా వెళ్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌వో లు, సిబ్బంది పాల్గొన్నారు.



మదనపల్లె జడ్పీహైస్కూల్లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అభిషిక్త్ కిశోర్



వాల్మీకిపురంలో పోలింగ్ స్టేషన్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆర్‌వో ఫర్హాన్‌అహ్మద్‌ఖాన్

పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించండి

గుర్రంకొండ, మే 11:ఓటర్లు ప్రశాంతంగా తమ ఓటు హక్కు ను వినియోగించుకొనేలా అధికారులు పని చేయాలని కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ సూచించారు. శనివారం సాయంత్రం ఆయన గుర్రంకొండలో పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పోలింగ్ కేంద్రాల్లో వసతులను పరిశీలించి ఓటర్లకు అనువుగా నీడ, తాగు నీరు, ఇతర సౌకర్యాలను కల్పించాలని ఆదేశించారు. అలాగే ఓటర్లు క్యూలో ఉండేందుకు భారీకేడను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. పోలింగ్ కేంద్రాల నుంచి వంద మీటర్ల దూరంలో నాయకులు, ప్రజలు ఉండేలా చూడాలని సూచించారు. ఎన్నికల్లో ఎటువంటి గొడవలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలను తీసుకోవాలని పోలీసులకు తెలిపారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు, ఎంసీసీ అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు చర్యలు చేపట్టాం

కురబలకోట, మే 11: జిల్లాలో ప్రశాంత ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని అంగళ్ళు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో స్ట్రాంగ్ రూములను జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్ట భద్రతను పకడ్బందీగా ఉంచడంతో పాటుగా ఎటువంటి లోటుపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ ప్రాంతంలో గట్టి బందోబస్తును ఏర్పాటు చేయాలని అధికారుల ను ఆదేశించారు. పోలింగ్‌కు సంబంధించి సామగ్రిని పకడ్బందీగా అందజేయాలన్నారు. ఎన్నికలకు సంబంధించి దాదాపుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

వాల్మీకిపురం, మే 11: వాల్మీకిపురం పట్టణంలోని పోలింగ్ కేం ద్రాలను పీలేరు నియోజకవర్గ ఎన్నికల అధికారి ఫర్హాన్ అహ్మద్ ఖాన్ శనివారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో సీసీ కెమెరాల ఏర్పాటు, ఓటర్ల సౌకర్యాలపై పర్యవేక్షిస్తూ స్థానిక అధికారులకు సూచనలు చేశారు. పోలింగ్ రోజున కేంద్రాలలో ఎక్కడా ఎలాంటి సమస్యలు రాకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఖతిజాన్‌కుబ్రా, డీటీ ఫిరోజ్‌ఖాన్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నల్లారి సోదరులను ఆదరించండి



నమూనా ఈవీఎంలతో ప్రచారం చేస్తున్న నల్లారి కుటుంబీకులు, టీడీపీ శ్రేణులు

పీలేరు, మే 11: అధికారాన్ని సొంత ప్రయోజనాల కోసం కాకుండా అభివృద్ధి కార్యక్రమాల కోసం అహర్నిశలు పాటుపడే నల్లారి సోదరులను ఆదరించాలని నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి సతీమణి నల్లారి తనూజా రెడ్డి పీలేరు నియోజకవర్గ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పీలేరు పట్టణం తిరుపతి రోడ్డు, బండ్లవంక ప్రాంతాల్లో శనివారం ఆమె తన కోడలు నల్లారి షమా రెడ్డి, కూతురు వైష్ణవీలతో కలిసి నమూనా ఈవీంల ద్వారా ఓటు వేసే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన ఆశయాలకు అనుగుణంగా తన భర్త నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి పీలేరు నియోజకవర్గాన్ని పాతికేళ్లు ముందుకు తీసుకెళ్లారన్నారు. వైసీపీ పాలనలో ఎటువంటి అభివృద్ధి జరగకపోగా నియోజకవర్గం పాతికేళ్లు వెనక్కు వెళ్లిపోయిందన్నారు. నియోజకవర్గంలో మళ్లీ అభివృద్ధి పనులు సాగాలంటే ఎంపీగా నల్లారి కిరణ్ కుమార్ రెడ్డిని, ఎమ్మెల్యేగా నల్లారి కిశోర్ కుమార్ రెడ్డిని గెలిపించాలన్నారు. కిశోర్ కుమార్ రెడ్డి కూతురు వైష్ణవి మాట్లాడుతూ తన తండ్రి తమతో గడిపిన సమయం కంటే నియోజకవర్గంలో గడిపిన సమయమే ఎక్కువని, ఆయన అహర్నిశలు పీలేరు అభివృద్ధి కోసం తపన పడేవారన్నారు. అభివృద్ధి కోసం తపన పడేవారిని ఆదరిస్తే నియోజకవర్గంలో విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. అనంతరం వారు నమూనా ఈవీఎంలతో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పురం రామ్మూర్తి, మల్లెల రెడ్డిబాషా, ఆంజి, వెంకటరత్నం, పురం రెడ్డమ్మ, లక్ష్మీకాంతమ్మ, వాణి, షమ, చందన, సూరి, జెమిని, శేఖర, బీజేపీ నాయకులు చంద్రశేఖర రెడ్డి, వెంకటరమణ, పీఎం ఖాన్, సుధారాణి, మహదేవనాయుడు, పాల్గొన్నారు.

మదనపల్లె అభివృద్ధికి సమర్థులను ఆదరించి గెలిపించండి

నిమ్మనపల్లి, మే 11: మదనపల్లె అభివృద్ధి కోసం ఎన్నికల్లో సమర్థులైన అభ్యర్థులను ఆదరించి గెలిపించాలని రాజంపేట టీడీపీ అధికార ప్రతినిధి ఆర్జేవెంటేష్ పేర్కొన్నారు. శనివారం రెడ్డివారిపల్లి పంచాయతి వడ్డిపల్లి, బొంతవారిపల్లిలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి షాజహాన్‌బాషా, రాజంపేట పార్లీమెంటు అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిలను గెలించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రవేశ పెట్టిన సూపర్‌సిక్స్ పథకాలలో భాగంగా బీసీలకు 50ఏళ్లకే పింఛన్‌ను ప్రవేశపెట్టిదని వీటితో పాటుగా ఆర్టీసీ బస్సుల్లో మహిళకు ఉచిత ప్రయాణం, మహిళకు నెలకు రూ.1500, ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, ఇస్తామన్నారు. 13న(సోమవారం) జరిగే సార్వత్రిక ఎన్నికల్లో అభివృద్ధికి తోడ్పడే అభ్యర్థులను ఆదరించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంకటరమణ, బీసీ అధికార ప్రతినిధి లక్ష్మన్న, సర్పంచ్ రెడ్డెప్ప, మాజీ సర్పంచ్‌లు రమణ, మల్లప్ప, మహమ్మద్ రఫి, శ్రీరాములు, మల్లికార్జున, నేతలు మురళి, పూజారికేశవ, గోపాలక్రిష్ణ, చంద్రసింగ్, సోము, శ్రీనివాసులు, నర సింహులు, శ్రీపతి, రెడ్డెప్ప, జయన్న, చిన బాబు, చెంద్రా యుడు, ఖాసింఖాన్, చంద్ర, పాల్గొన్నారు.

మదనపల్లెలో ప్రచారం పరిసమాప్తం



ప్రచార ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి షాజహాన్‌బాషా, నల్లారి నిఖిలేశ్‌రెడ్డి

మదనపల్లె టౌన్, మే 11: ఎన్నికల ప్రచారంలో రాజకీయ పార్టీ నాయకుల ప్రచార రథాల మైకుల శబ్దాలు, పాటల హోరు మూతపడ్డాయి. ఎన్నికల నామినేషన్‌లు విత్‌డ్రాలు పూర్తి అయిన వెంటనే ప్రధాన పార్టీల ఎన్నికల ప్రచారం, వారికి సాటిగా స్వతంత్ర్య అభ్యర్థులు కూడా ప్రచార రథాలుపెట్టి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శనివారం సాయంత్రం 5గంటలకు ఎన్నికల ప్రచారాలు నిలిపివేయాలని ఈసీ ఉత్తర్వులు ఇవ్వడంతో ప్రచారరథాలు సైలెంట్ అయిపోయాయి. ఇదిలా వుండగా ప్రధాన రాజకీయ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం, ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తూ బిజీగా గడిపినా, చివరి రోజున మదనపల్లె పట్టణంలో ప్రధాన వీధులు, ప్రధాన కూడళ్లలో ప్రచార ర్యాలీ నిర్వహించారు. బీజేపీ తరఫున మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి తనయుడు నల్లారి నిఖిలేశ్‌రెడ్డి, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షాజహాన్‌బాషా, టీడీపీ సీనియర్ నేత రాటకొండ బాబురెడ్డి, జనసేన నాయకులు శివరామ్ తదితరులతో పెద్దఎత్తున పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. వారికి పోటీగా వైసీపీ అభ్యర్థి నిస్సార్‌అహ్మద్ పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి మల్లెల పవన్‌కుమార్‌రెడ్డి కూడా వాహనాలతో ప్రచార ర్యాలీ నిర్వహించారు.

కలికిరిలో: పోలింగ్‌కు 48 గంటల ముందుగా ఎన్నికల ప్రచారాన్ని ముగించాలన్న నిబంధనల మేరకు శనివారం సాయంత్రం 6 గంటలకు అభ్యర్థులంతా తమ ప్రచారానికి ముగింపు పలికారు. ఫలితంగా నెలన్నరగా హోరెత్తించిన మైకులు ఒక్కసారిగా మూగబోయాయి. మొత్తం ప్రచారమంతా సైలెంట్ మోడ్‌లో కి వెళ్లిపోయింది. మరో వైపు ప్రధాన పార్టీ అభ్యర్థులు పోటీలు పడి ఓటర్లకు డబ్బులు పంపిణీని కూడా దాదాపు పూర్తి చేసినట్లు సమాచారం. కాగా అధికార పార్టీ నాయకులు ఓట్ల కోసం డబ్బులు కుమ్మరిస్తారనే ఆశతో వున్న ఓటర్లు తీరా వారు అనుకున్న దానికన్నా తక్కువ మాత్రమే ఇవ్వడం పట్ల పెదవి విరుస్తున్నారు.

కలకడలో:సార్వత్రిక లోకసభ, శాసనసభ ఎన్నికల వేళ ఆయా రాజకీయ పార్టీల ప్రచారానికి శనివారం సాయంత్రం తెరపడింది. మండలంలోని ప్రధానంగా టీడీపీ, బీజేపీ, జనసేన తరఫున నాయకులు ప్రచారాలను హోరెత్తించారు. ఇందులో భాగంగా పీలేరు టీడీపీ అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి అన్ని గ్రామాల్లో ఇంటింట ప్రజలను నేరుగా కలుసుకున్నారు. గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని నాశనం చేసిన వైసీపీ మాటలను నమ్మొద్దని ఓటర్లకు సూచించారు. మరోసారి మోసపోకుండా ఓటు విషయంలో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు.

నల్లగంగమ్మకు బీసీ నాయకుల పూజలు



నల్లగంగమ్మ ఆలయంలో ప్రార్థనల్లో పాల్గొన్న బీసీ నాయకులు, నల్లారి కుటుంబీకులు

పీలేరు, మే 11: నల్లారి సోదరుల విజయం కోసం పీలేరు-తిరుపతి మార్గంలోని నల్లగంగమ్మ ఆలయంలో శనివారం బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి సతీమణి నల్లారి తనూజా రెడ్డి, కోడలు నల్లారి షమారెడ్డి, కూతురు వైష్ణవి ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బోడె రాజశేఖర్ యాదవ్ మాట్లాడుతూ నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి, నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి విజయం సాధిస్తే చట్టసభల్లో రాష్ట్రంలోని బీసీల గొంతుకలవుతారన్నారు. రాజంపేట పార్లమెంటు సెగ్మెంటు, పీలేరు అసెంబ్లీ నియోజకవర్గంలోని బీసీలు నల్లారి సోదరులను ఆదరించి, తమ బంధువులు, స్నేహితుల ఓట్లు కూడా వేయించి మంచి మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం నల్లారి సోదరుల విజయం కోసం 1116 కొబ్బరి కాయలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ హక్కుల పోరాట సమితి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఎద్దుల మహేశ్, పీలేరు నియోజకవర్గ అధ్యక్షులు చింతగింజల అశోక్ కుమార్, నాయకులు సుధారాణి, శ్రీకాంత్, శివ, భాను, తదితరులు పాల్గొన్నారు.



వాల్మీకిపురం మండలం చింతపర్తిలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

వాల్మీకిపురంలో: పీలేరు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలంతా నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి వెంటే ఉన్నారని వాల్మీకిపురం మండలం చింతపర్తి సర్పంచ్ మహితా రెడ్డి పేర్కొన్నారు. శనివారం గ్రామ పంచాయతీలోని చారావాండ్లపల్లె, మద్దెల చెరువుపల్లె, చింతపర్తి తదితర ప్రాంతాలలో ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా డమ్మీ ఓటింగ్ ఈవీఎంలతో ప్రచారం చేస్తూ ఎమ్మెల్యే అభ్యర్థిగా నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డికి సైకిల్ గుర్తు, ఎంపీ అభ్యర్థిగా నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డికి కమలం గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు జయచంద్రారెడ్డి, శేషాద్రిరెడ్డి, మద్దెల గిరిబాబు, మోహ న్, మహేష్, రాజేష్, రమేష్, శివ, మురళి, శంకర, కిరణ్, సురేష్, బాలకృష్ణ, భరత్, నాగార్జున, చిరంజీవి, సంతోష్, వంశీ, గణేష్, మల్లి, రాము, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సొంత ఊర్లకు వెళ్లటానికి ప్రయాణికుల ఇక్కట్లు



సొంత ఊర్లకు వెళ్లటానికి ఆర్టీసీ బస్టాండ్‌లో వేచివున్న ప్రయాణికులు .

మదనపల్లి అర్బన్ మే 11 : సార్వత్రిక ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి సొంత ఊర్లకు బయలుదేరిన ప్రయాణికులు సమయానికి బస్సు లేక తీవ్రఇబ్బందులు ఎదుర్కున్నారు. బెంగళూరు నుంచి వివిధ ఉద్యోగాల్లో స్థిర పడిన ఏపీ ప్రయాణికులు తమ సొంత ఊర్లకు 13వ తేదీ ఓటు వేయటానికి రావడంతో సమస్యలు ఎదుర్కొన్నారు. బస్సులు అందుబాటులో లేని కారణంగా బస్సు టాప్ పై ప్రయాణం చేయాల్సి వచ్చింది. ఉదయం నుంచి మదనపల్లె ఆర్టీసీ బస్టాండ్‌లో గంటల కొద్ది బస్సుల కోసం ప్రయాణికులు నిరీక్షించారు .సుదూర ప్రాంతాల నుంచి సొంతూర్లు చేరుకోడానికి ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వం ఇలాంటి వారికోసం అధికంగా సర్వీసులను ఏర్పాటు చేయలేకపోయింది. దీంతో చేసేది లేక కొందరు అధిక చార్జీలు వెచ్చించి ప్రైవేటు వాహనాలలో ప్రయాణం చేశారు.

ఆదరించి.. అభివృద్ధికి అవకాశం కల్పించండి

● తంబళ్లపల్లె నియోజకవర్గ కూటమి అభ్యర్థి జయచంద్రారెడ్డి



ములకలచెరువు, మే 11: ఆదరించి ఎన్నికల్లో ఒక్క అవకాశం కల్పించి.. తంబళ్లపల్లె నియోజకవర్గ అభివృద్ధి చేయడానికి తోడ్పడాలని నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొ న్నారు. ములకలచెరువులో పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోమవారం జరిగే పోలింగ్‌లో రాజంపేట నియోజకవర్గ పార్లమెంటు అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డికి కమలం గుర్తుకు, తంబళ్లపల్లె నియోజకవర్గ కూటమి అభ్యర్థి అయిన తనకు సైకిల్ గుర్తుపై ఓట్లేసి అత్యధిక మెజా ర్టీతో గెలిపించాలని కోరారు. తంబళ్లపల్లె నియోజకవర్గం అన్ని విధాల అభివృద్ధి చెందాలంటే వైసీపీని ఇంటికి పంపాలన్నారు. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయ మన్నారు.

మద్యం కోసం మందుబాబుల చిందులు



మద్యం దుకాణం వద్ద గొడవపడుతున్న మందుబాబులు

గుర్రంకొండ, మే 11:గుర్రంకొండ మద్యం దుకాణం వద్ద మందుబాబులు శనివారం మద్యం సక్రమంగా ఇవ్వలేదంటూ గొడవపడ్డారు. దుకాణంలో పని చేసే సిబ్బంది కొందరికి మాత్రం ఇష్టానుసారంగా మద్యం ఇస్తున్నారంటూ మందుబాబులు చిందులేశారు. ఈ క్రమంలో మద్యం ప్రియులు రాజకీయ పలుకుబడి ఉన్నవారికి మాత్రం పదుల సంఖ్యలో మద్యం బాటిళ్లను ఎలా ఇస్తారంటూ మందుబాబులకు సిబ్బందికి మధ్య వాగ్వివాదం జరిగింది. ఈ నేపథ్యంలో విషయం పోలీసులకు తెలియడంతో దుకాణం వద్దకు చేరుకుని మందుబాబులను అక్కడ నుంచి పంపేశారు. దుకాణంలో పని చేసే సిబ్బంది దళారులకు ఇష్టానుసారంగా మద్యం ఇచ్చి పంపుతున్నారని ఎస్‌ఐ శ్రీనివాసులు దృష్టికి తీసుకొచ్చారు. మద్యం అమ్మకాలు సరిగా చేయాలని ఆయన సిబ్బందికి సూచించారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి



ప్రచారం చేస్తున్న బీజేపీ, టీడీపీ, జనసేన నేతలు

తంబళ్లపల్లె, మే 11: బీజేపీ, టీడీపీ, జన సేన కూటమి ప్రభుత్వం ఏర్పాటుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర బీజేపీ సీనియర్ నేత చల్లపల్లె నరసింహా రెడ్డి అన్నారు. శనివారం టీడీపీ, బీజేపి, జనసేన నాయకులు, కార్యకర్తలు మండలంలోని కోటకొండ, కొటాల, గోపిదిన్నె పంచాయతీలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కూటమి మేనిఫెస్టోను వివరించారు. సోమవారం జరుగనున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటేసి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డిని, కమలం గుర్తుకు ఓటేసి రాజంపేట ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ నేతలు నీరూప్‌కుమార్‌రెడ్డి, రామస్వామిరెడ్డి, జనసేన మండల నాయకుడు ఎద్దులనరసింహులు, మురళీకృష్ణ, మనోహర్, మారుతి ప్రసాద్ పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన మాజీ ఎంపీటీసీ



టీడీపీలో చేరిన శేషాద్రి సూరితో కూటమి అభ్యర్థి జయచంద్రారెడ్డి

పెద్దతిప్పసముద్రం మే 11 : పీటీఎంకు చెందిన మాజీ ఎంపీటీసీ శేషాద్రి సురేష్ శనివారం ములకలచెరువులోని టీడీపీ కార్యాలయంలో పార్టీలో చేరారు. టీడీపీ సీనియర్ నాయకులు బూర్లపల్లె సుధాకర్‌రెడ్డి మాజీ సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి, సికిందర్, నరసింహులు, రామాంజులు, రామచంద్ర, కుమ్మరివారిపల్లె రెడ్డెప్ప, మాదవరెడ్డిల ఆధ్వర్యంలో టీడీపీ కండువా కప్పుకున్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి జయచంద్రారెడ్డి సురేష్‌కు పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జయచంద్రారెడ్డి మాట్లాడుతూ ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిల విజయానికి కృషి చేయాలని కోరారు.

బస్సు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం

మదనపల్లె అర్బన్, మ 11: మదనపల్లె పట్టణంలోని వారపు సంత వద్ద బస్సు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే దుర్మరం చెందాడు. ఈ సంఘటన శనివారం రాత్రి మదనపల్లెలో చోటు చేసుకుంది. మృతి చెందిన వ్యక్తి వయస్సు సుమారుగా 45 ఏళ్లు ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న రెండో పట్టణ ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య మృతదేహాన్ని పరిశీలించి, పంచానామాకు జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడు ఎవరికైనా తెలిసి ఉంటే కుటుంబసభ్యులకు లేదా పోలీసులకు వివరాలు తెలపాలని ఎస్‌ఐ కోరారు.

ఎన్నికల వేళ కూలీలకు డిమాండ్

మదనపల్లె టౌన్, మే 11: ఎన్నికల వేళ కూలీలకు బాగా డిమాండ్ పెరిగింది. అదేంటి ప్రచారాలు అయిపోయాయి కదా ఇంకా కూలీలకు డిమాండ్ ఏమిటనుకుంటున్నారా.. అవును నిజమండి మదనపల్లె నియోజకవర్గంలో పలుచోట్ల మల్లెమొగ్గల తోటలు ఉన్నాయి. ఉదయం వెలుతురు వస్తూనే తోటల్లో దిగే కూలీలు మల్లెమొగ్గలు పీకి 9గంటలకు ఇంటికి చేరుకుంటారు. కాని రెండు రోజులుగా మల్లెమొగ్గలు పీకడానికి కూలీలు సరిగ్గా రావడం లేదని తోటల యజమానులు గగ్గోలు పెడుతున్నారు. దీనికి కారణం ఉందండోయ్.. గత రెండు రోజులుగా రెండు ప్రధాన పార్టీలు ఓటర్ల ఇంటింటి తిరుగతూ స్లిప్పులు ఇచ్చిన వారికి రూ.2వేల దాకా నగదు అందజేస్తున్నారు. ఒక్కో ఇంట్లో ఎంత మంది ఓటర్లు వుంటే అన్ని రెండు వేలు ఇస్తున్నారు. దీంతో చాలా మంది ఈ నగదు కోసం కూలీ పనులకు కూడా వెళ్లకుండా ఇంటి వద్దనే వుండిపోతున్నారు. అంతే కాదు సుమా..రాత్రి పూట మాత్రమే రాజకీయ నాయకులు నగదు పంపిణీ చేస్తుండటంతో చాలా మంది నిద్రపోకుండా ఆరుబయట అర్ధరాత్రి వరకు వేచి చూస్తున్నారు. ఓ పార్టీ జోరుగా నగదు పంపిణీ చేస్తుండగా మరో పార్టీ చివరి రెండు రోజుల్లో నగదు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టినట్లు సమాచారం. దీంతో ఊళ్లకు సైతం వెళ్లకుండా ఓటర్లు ఇంటి వద్దనే పడిగాపులు కాస్తున్నారు.

జన కేతనం



ఒక బీరుపై ఐదేళ్లలో బాదింది రూ.1.80 లక్షలు

టీడీపీ హయాంలో గరిష్ఠంగా ఓ బీరు ధర (మంచి బ్రాండు) రూ.120 వరకు ఉండేది. ప్రస్తుతం బీరు రూ.220. అదీ నాసిరకం బ్రాండ్లు. అంటే రూ.వంద పెరిగింది. రోజుకు ఒక బీరు తాగే వారిపై నెలకు రూ.3 వేలు, ఏడాదికి రూ.36 వేలు, వైసీపీ అధికారంలో ఉన్న ఈ ఐదేళ్లలో రూ.1.80 లక్షలు గుంజేశారు. ఎక్కువ మంది యువకులు బీరు ప్రియులు. రెండు మూడు బీర్లు తాగేవాళ్లూ ఉంటారు. వీరి నుంచి మరింత అదనగా లాగేశారన్న మాట.

ఒక్కో శ్రమజీవి నుంచీ గుంజింది రూ.2.88 లక్షలు

కార్మికులు, కూలీలు.. ఇలా శ్రమ జీవులు ఎక్కువ మంది చీప్‌లిక్కర్ తాగుతుంటారు. టీడీపీ హయాంలో చీప్ లిక్కర్ ఓ క్వార్టర్ బాటిల్ రూ.50 ఉండగా.. ఇప్పుడది రూ.130కు పెరిగింది. అంటే రూ.80 పెంచారు. సగటున రెండు క్వార్టర్ల తాగుతారు. అంటే రోజుకు రూ.160 చొప్పున, నెలకు రూ.4,800, ఏడాదికి రూ.57,60 చొప్పున ఐదేళ్లలో రూ.2.88 లక్షలు అదనంగా జగన్ ప్రభుత్వం గుంజేసింది. రోజువారి కూలి సంపాదన రూ.600 రూ.800 మధ్యలో ఉంటుంది. అందులో సగం ఇలా నాసిరకం మద్యానికే పోతోంది. ఇలా శ్రమజీవుల కష్టాన్నీ దోచేశారు.


మధ్యతరగతినీ వదల్లేదు

మధ్యతరగతి వాళ్లు, ఉద్యోగుల్లోని మద్యం ప్రియులు .. సరదాగా మంచి బ్రాండ్లను సగటున రోజుకో క్వార్టర్ తాగేవాళ్లు ఉన్నారు. బ్లెండర్స్ ప్రైడ్, మ్యాన్షన్ హౌస్, కొరియర్ నెపోలియన్ వంటి బ్రాండ్లను ఎక్కువగా ఇష్టపడతారు. టీడీపీ హయాంలో వీటి ధరలు రూ.220, రూ.120, రూ.160.. చొప్పున ఉండేవి. ఇప్పుడవే ధరలు రూ.300, రూ.220, రూ.280గా ఉన్నాయి. అంటే ప్రతిదాని మీదా సగటున రూ.100 పెరిగింది. రోజుకు వంద చొప్పున నెలకు రూ.3 వేలు, ఏడాదికి రూ.36 వేలు.. ఈ ఐదేళ్లలో రూ.1.80 లక్షలు నష్టపోయారు.

- ఈ మూడు వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం ఎంత లబ్ధి చేకూర్చిందో గానీ.. ఆ ఇళ్లల్లోని ఒక్కో మందుబాబు నుంచి మాత్రం రూ.లక్షకు పైగా లాగేసింది. ఈ ప్రభుత్వం వారికి చేసిన మేలెంత? చేటెంత? అనేది మందుబాబులు.. వారి కుటుంబాలే చెప్పాలి.

జగనన్న మద్యంతో ఇళ్లు.. ఒళ్లు గుల్ల

● చెప్పిందే రేటు.. ఇచ్చిందే బ్రాండు



అధికారంలోకి వచ్చాక జగన్ తీసుకొచ్చిన మద్యం పాలసీ మందుబాబుల ఇళ్లను.. ఒళ్లను గుల్ల చేస్తోంది. గతానికి భిన్నంగా ప్రభుత్వమే మద్యం దుకాణాలను ఏర్పాటు చేసింది. క్వాలిటీ బ్రాండ్లు కాదని.. కొత్త కొత్త పేర్లతో నాసిరకం మద్యాన్ని తీసుకొచ్చారు. వీటిని 'జే' బ్రాండ్లుగా ప్రతిపక్షాలు విమర్శిస్తుంటాయి. మరోవైపు మద్య వినియోగం తగ్గించేందుకని సాకు చెప్పి.. విపరీతంగా ధరలు పెంచారు. రానున్న 20 ఏళ్లలో మద్యం తాగేవారిపై వచ్చే ఆదాయాన్ని చూపి అప్పు తీసుకొచ్చారు. తాము చెప్పిందే రేటు.. ఇచ్చిందే మద్యం బ్రాండుగా వ్యవహరించారు. అన్ని వర్గాల ప్రజల్లాగే.. మందుబాబులనూ జగన్ బాదేశారు.

జిల్లాలో 113 ప్రభుత్వ మద్యం దుకాణాలు, పది బార్లు, రెండు ఎలైట్ స్టోర్లు ఉన్నాయి. నిత్యం రూ. 2 కోట్ల వరకు మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. ఏడాదికి రూ.700 కోట్లకుపైగా ఆదాయం వస్తోంది. దుకాణాల సంఖ్య తగ్గించిన ప్రభుత్వం ధరలు బాగా పెంచింది. గత టీడీపీ ప్రభుత్వంలో రూ.50 ఉన్న క్వార్టర్ మద్యం సీసా ధర ఏకంగా రూ.150కు పెంచేశారు. ఆదాయం పెంచాలనే ఉద్దేశంతో ఎక్సైజ్ శాఖ కూడా అనధికారికంగా బెల్టు షాపులను ప్రోత్సహించింది. చాలా గ్రామాల్లో చిల్లర దుకాణాలు, టీదుకాణాలు, కూల్ డ్రింక్ షాపుల్లో 24 గంటలూ మద్యం అందుబాటులో ఉంటోంది. వీటి వెనుక వైసీపీ నేతలు ఉన్నారు. వీరంతా మద్యం బెల్టు షాపులను అక్రమార్జనగా ఎంచుకున్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో సేల్స్‌మెన్, సూపర్‌వైజర్లు వైసీపీ నేతలు సిఫార్సు చేసిన వారే కావడంతో బెల్టు షాపులకు కావాల్సినంత మద్యం సరఫరా చేస్తున్నారు. మద్యం దుకాణాలవద్ద సీసీ కెమెరాలు, డిజిటల్ పేమెంట్లు అలంకారప్రాయంగా ఉన్నాయి. మద్యం అమ్మకాలు పెరిగి ప్రభుత్వ ఖజానాకు ఆదాయం సమకూరుతుండటంతో ఎక్సైజ్, ఎస్ఈబీ అధికారులు బెల్టు షాపుల విషయంలో పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. కర్ణాటక, తమిళనాడు మద్యం విక్రయిస్తే మాత్రం చర్యలు తీసుకుంటున్నారు.

మద్యపానంపై అవగాహన కార్యక్రమాలేవి ?

మద్యం తాగడం వల్ల తలెత్తే అనర్థాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమలను ప్రభుత్వం చేపట్ట లేదు. మద్యానికి బానిసలుగా మారిన వారికోసం.. మద్యం తాగే అలవాటు మాన్పించేందుకు డీ అడిక్షన్ కేంద్రాలు పెట్టలేదు.

- చిత్తూరు సిటీ

ఇదీ చంద్రబాబు మాట

గతంలోలాగే బ్రాండెడ్.. నాణ్యమైన మద్యాన్ని అందుబాటులోకి తీసుకొస్తాం. ధరలను తగ్గిస్తాం. మందుబాబులకు అవగాహన కార్యక్రమాలతో పాటు డీ అడిక్షన్ సెంటర్లను ప్రారంభిస్తాం.

ఓటెలా అడుగుతున్నావ్ జగన్..!

మూడు విడతల్లో మద్యం దుకాణాలు తగ్గించుకుంటూ పోతాం. మందు ముట్టుకుంటేనే షాక్ కొట్టేలా ధరలు పెంచుతాం. ఆపై పూర్తిగా మద్యాన్ని ఎత్తేస్తాం. మద్యపాన నిషేధం చేశాకే 2024లో ఓట్లు అడగతా.

- ఇది 2019 ఎన్నికల ప్రచారంలో అక్క చెల్లెమలకు ప్రతిపక్ష నేత జగన్ ఇచ్చిన హామీ.

అధికారంలోకి వచ్చాక..: మద్య నిషేధం చేయలేదు. తాము చెప్పింది మద్య నిషేధం కాదని.. నియంత్రణ అంటూ వైసీపీ నేతలు బుకాయించారు. క్షేత్రస్థాయిలో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. ఎక్సైజ్, ఎస్ఈబీ అధికారులూ అమ్మకాల లెక్కలు చెప్పడం లేదు. టీడీపీ పాలనలో కన్నా ఇప్పుడే ఎక్కువ మద్యం వ్యాపారం జరిగిందనే విషయం బయటపడుతుందనే ఇలా చేస్తున్నారన్న విమర్శలున్నాయి.

వెల్లువలా కర్ణాటక మద్యం

- బెల్టు షాపులకు డోర్ డెలివరీ
- అధికార పార్టీ అండతో పేట్రేగిపోతున్న మాఫియా

మనకు నాణ్యమైన మద్యం బ్రాండ్లు లేకపోవడం.. అధిక ధరలు.. దీంతో సరిహద్దులోని మందుబాబులు కర్ణాటక మద్యానికి అలవాటు పడ్డారు. దీన్ని ఆసరాగా చేసుకుని వైసీపీ నేతలు, వారి మద్దతుదారులు కర్ణాటక నుంచి మద్యాన్ని తీసుకొచ్చి.. బెల్టు షాపులకు డోర్ డెలివరీ చేస్తున్నారు. ఇక్కడ అధిక ధరలకు (ఇక్కడి ధరలతో పోలిస్తే తక్కువ) విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇటీవల రామకుప్పం మండలానికి చెందిన అధికార పార్టీ నేత కారులో కర్ణాటక మద్యం బాక్సులను పోలీసులు పట్టుకున్నారు. చాలా కాలంగా వీరు బెల్టు దుకాణాలకు మద్యం డెలివరీ చేస్తున్నట్లు విచారణలో నిందితులు అంగీకరించారు. అధికార నేతను పోలీసులు రిమాండుకు తరలించారు. ఐదేళ్లలో వి.కోట అర్బన్ స్టేషన్‌లోనే ఏడాదికి 30కిపైగా మద్యం అక్రమ తరలింపు కేసులు నమోదు కావడం గమనార్హం. కార్లతో పాటు ద్విచక్ర వాహనాల్లోనూ తరలిస్తూ పట్టుబడిన వారు కొందరైతే, తప్పించుకున్న వారు మరెందరో?



పోలీసులు సీజ్ చేసిన అక్రమ మద్యం (ఫైల్ ఫోటో)

జే బ్రాండ్లతో పేదల బతుకులు ఛిద్రం

ఐదేళ్లలో 12508 మంది కాలేయ బాధితులు

వందలాది మంది మృత్యువాత

● చిత్తూరు రూరల్ మండలానికి చెందిన కస్తూరి భర్త కుమార్ పెయింటర్. వీరికి ఇద్దరు చిన్న పిల్లలు. మద్యానికి బానిసైన కుమార్ రెండేళ్ల కిందట ప్రాణాలు కోల్పోయాడు. దీంతో కుటుంబ పోషణ ఆమెపై పడింది. దీంతో తాపీ కూలిగా పనిచేస్తూ పిల్లలను చూసుకుంటోంది. నాసిరకం మద్యం ఆమె కుటుంబాన్ని రోడ్డున పడేయగా...ఇంత వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందలేదు.

● గుడిపాల మండలానికి చెందిన రోసి మూడేళ్ల కిందట ప్రేమ వివాహం చేసుకుంది. భర్త శ్యామ్ ప్లంబర్‌గా పనిచేసేవాడు. క్రమేణా శ్యామ్ మద్యానికి బానిసయ్యాడు. లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఆరు నెలల కిందట మృతిచెందారు. వీరికి ఒకటిన్నరేళ్ల పాప ఉంది.

జగన్ ప్రభుత్వంలో వైసీపీ నేతలు సొంత బ్రాండ్లతో మద్యాన్ని తీసుకొచ్చారు. నాణ్యత పాటించకుండా.. నిరుపేదల ఆరోగ్యంతో ఆటలాడుతున్నారు. నాసిరకం మద్యానికి బలైపోయిన ఎన్నో కుటుంబాలు నేటికీ తేరుకోలేకపోతున్నాయి. ఒక్క చిత్తూరు నియోజకవర్గంలోనే పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తున మరణాలు సంభవించినా వేరే కారణాలను చూపిస్తున్నారు.

ఐదేళ్లుగా కాలేయ, కిడ్నీ వ్యాధితో చికిత్స తీసుకున్న.. తీసుకుంటున్న వారి వివరాలు

సంవత్సరం	బాధితులు
2020	2550
2021	2700
2022	3200
2023	3700
2024 ఇప్పటి	వరకు358
మొత్తం	12508

పెరిగిన కాలేయ బాధితులు

నాసిరకం మద్యం కారణంగా ఆరోగ్యం దెబ్బతిని ఆస్పత్రులుకు వెళ్తున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఒక్క చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలోనే ఐదేళ్లలో 12508 మంది చికిత్స పొందారు. బాధితులు తొలుత జీర్ణకోశ వ్యాధుల బారిన పడుతున్నారు. ఆపై పేగుల్లో పుండ్లు ఏర్పడుతున్నాయి. చివరిగా కాలేయం దెబ్బతిని మరణాలు సంభవిస్తున్నాయి. నాసిరకం మద్యం తాగినవారిలో సున్నితమైన కాలేయం గట్టిపడి పూర్తిగానిర్వీర్యమవుతోన్న కేసులు ఎక్కువగా వస్తున్నాయి. చికిత్స కోసం వేలాది రూపాయల ఖర్చులతో అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.

ప్రాణాలు కోల్పోయే ప్రమాదం

'మద్యం తాగడం వల్ల ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింటుంది. కల్తీ, నాసిరకం మద్యం తాగడం వల్ల పేగుల్లో పుండ్లు ఏర్పడుతున్నాయి. ఇలాంటి కేసులు ఇక్కడ చాలానే చూశాను. పుండ్లతో మొదలై క్రమంగా మిగిలిన అవయవాలైన కాలేయం, కిడ్నీ దెబ్బతినడమే కాకుండా గుండె పోటుకు గురయ్యే అవకాశం కూడా ఉంది' అని చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలోని ఓ వైద్యుడు తెలిపారు.


- చిత్తూరు రూరల్

సరిహద్దులో 20కిపైగా మద్యం దుకాణాలు

వి.కోట మండలానికి మూడు వైపులా కర్ణాటక సరిహద్దు ఉంది. మన జిల్లాలో ఉన్న డిమాండుతో సరిహద్దుల్లో 20కి పైగా వైన్ షాపులు, బార్లు పుట్టగొడుగుల్లా పుటుకొచ్చాయి. ఆ రాష్ట్రంలోని మూలనున్న దుకాణాలను అధిక ధరలకు కొని.. వాటిని షిఫ్టింగ్ పేరిట వి.కోట సరిహద్దుల్లో ఏర్పాటు చేస్తున్నారు. ఇలా పత్రపల్లె సమీపంలోని కేజీఎఫ్ మార్గంలో రెండు, కుప్పం మార్గంలో దాసార్లపల్లె వద్ద నాలుగు, ఇటుకరాళ్లపల్లె గ్రామీణ మార్గంలో ఓ బార్, గంధారమాకులపల్లె సమీపంలో ఓ దుకాణం ఉంగా.. ఇటీవల మరో బార్ అండ్ రెస్టారెంట్ ప్రారంభమైంది. ఇక, తోటకనుమ పంచాయతీకి సమీపంలో ముళబాగల్ రోడ్డులో మన సరిహద్దులోనే రెండు బార్లు, మరో రెండు వైన్ షాపులు వెలిశాయి. కొంగాటం పంచాయతీకి ఆనుకుని రాజుపేటరోడ్డులో రెండు మద్యం షాపులు, మూడు బార్ అండ్ రెస్టారెంట్లు నడుస్తున్నాయి.

- వి.కోట

ఇదీ మందు



పంపకాలు మొదులైనప్పుటినింకా కుప్పంలో అతికార పార్టీ వోల్లు దేవుళ్ల పటాలు పెట్టుకోని తిరగతా వుండారంట. 'మాకే ఓటేస్తామని దేవుడిమింద ప్రెమాణం జెయ్యండి. అనాక కాసులు తీసుకోని ఎల్లండి' అని షరతు పెట్తావుండారంట. చేసేదే పాపం పని. ఇంగ దేవుడిని గూడా ఈ పాపంలోకి ఎందుకు లాగాల.. అనుకున్న ఓటర్లు శానామంది ప్రెమాణం చెయ్యకుండానే ఒట్టి చేతుల్తో ఎనక్కి ఎల్లిపోతావుండారంట. మిగిలినోల్లు మాత్తరం, 'అ.. ఎవురికేస్తే ఏంది? ఆ దేవుడు దిగొచ్చి చూడబోతాడా, లేకపోతే కొట్టబోతాడా?' అనేసి ప్రెమణాలు సేసేసి, కాసులు తీసుకుంటా వుండారంట.

- కుప్పం

'సగం' తంటాలు!

● ఎట్టెట్టా!

'ఈ సగం సగం బతుకులేంట్రా సామీ..' అంటా అధికార పార్టీ కార్యకర్తలు కుమిలిపోతా వుండారు కుప్పంలో. ఎందుకంటే.. ఓటుకు నాలుగు ఎయ్యిలు లెక్కన పక్కా లెక్కగట్టి ఇస్తావుండారు వోల్లు. నిన్నమొన్నటిదాకా అందరికీ అయిదు ఎయ్యిలు తక్కవ కాకుండా పంచతారని తెగ ప్రెచారం జరిగిపొయ్యింది. తీరా మొదులు పెట్టినాక నాలుగు ఎయ్యిలకు దిగింది. 'సరే లేప్పా.. ఎంతో అంత, ఇట్టా పారెయ్యి' అంటా జనం సర్దుకొనే టయానికి, ఆ ఇచ్చేది సగం మందికే అనే ఇసయం బయటపడి రచ్చరచ్చ అయిపోతా వుండాది. ఒగింట్లో ముగ్గురు మొనుసులుంటే మూడు పార్టీలల్ల తిరగతా వుండారాయె. అతికార పార్టీ ఆ ఇంటికి ఎల్లి తమ పార్టీ మనిషికే కాసులు ఇస్తామంటే ఇనడంలేదు మిగిలిన ఇద్దురూ. మొన్నటికిమొన్న కుప్పం మున్సిపాలిటీలో ఇద్దురు అన్నదమ్ములుంటే ఒకరికి కాసులిచ్చారంట. ఆ రొండో మనిషి అగ్గిమీద గుగ్గిలమైపొయ్యి ఆ వొచ్చినవోల్లపై తిరగబడినారంట. ఊరూవాడా ఇదే గొడవలు. ఓటింగు దగ్గర పడే కొందికీ, 'మనోడికి డిపాజిట్టు అయినా దక్కతాదో లేదోన'ని వాల్ల నాయకులకు గుండిల్లో దిగులు పడిపాయె. ఇగ, ప్రెతిపెచ్చ పార్టీ పంచేది, అతికార పార్టీవోల్లు పంచే కాసుల్లో సగమే అయినా గొడవలు లేకుండా జరిగిపోతా వుండాది. ఈల్లు కనాకస్టం 70 నుంచి 80 పర్సంటు ఓటర్లకు పంచతా వుండారంట. 'పాపం.. అతికారంలో లేరు గదా..' అనేసి జనం గూడా ఏమనడం లేదు. సెంద్రబాబును గాకుండా ఇంగెవురిని గెలిపించుకున్నా ఈసారి మనకు పుట్టగతులుండవని, ఆ మిగిలిన మంది గూడా గమ్మున ఉండిపోతా వుండారంట.

- కుప్పం

ఓటు వేయాలంటే 'గుర్తింపు' తప్పనిసరి


● నోట్ దిస్ పాయింట్



పోలింగ్ కేంద్రాల్లో ఓటేయాలంటే ఓటరు స్లిప్పులతో పాటు గుర్తింపు కార్డును ఓటర్లు చూపాలి. ఓటరు గుర్తుంపు కార్డు ఉంటే సరిపోతుంది. లేదంటే పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్సు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లేదా ప్రభుత్వ రంగ సంస్థలు, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు, ఆయా సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు జారీచేసిన ఫోటో గుర్తింపు కార్డులు, బ్యాంకు లేదా పోస్టాఫీసులు జారీ చేసిన పాస్‌బుక్‌లు, పాన్‌కార్డు, కార్మికశాఖ జారీ చేసిన స్మార్ట్ కార్డు, ఉపాధి హామీపథకం జాబ్‌కార్డు, కార్మికశాఖ జారీచేసిన ఆరోగ్య బీమా కార్డు, ఫొటోతో పాటు ఉండే పెన్షన్ డాక్యుమెంట్, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు అధికారికంగా జారీచేసే గుర్తింపుకార్డు, ఆధార్ కార్డు, సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్‌మెంట్ మంత్రిత్వ శాఖ జారీచేసిన యూనిక్ డిసేబిలిటీ ఐడీ కార్డుల్లో ఏదో ఒకటి ఉంటే చూపితే చాలు.

- చిత్తూరు కలెక్టరేట్

బాబు మెజారిటీ ఎంత?



నారా చంద్రబాబునాయుడు (టీడీపీ)

- కుప్పంలో ఈ దఫా లక్ష ఓట్ల ఆధిక్యం కోసం టీడీపీ ప్రణాళికలు
- ప్రశాంత నియోజకవర్గంలో ఐదేళ్లుగా వైసీపీ ధ్వంస రచన
- చంద్రబాబు చేసిన అభివృద్ధి ఆనవాళ్లు లేకుండా చేసే యత్నం
- టీడీపీ కేడర్‌ను కకావికలం చేసే ఎత్తులు
- వందల మంది కార్యకర్తలపై అక్రమ కేసులు
- అంతా మంత్రి పెద్దిరెడ్డి పెత్తనమే
- స్వేచ్ఛ లేని వైసీపీ అభ్యర్థి భరత్

కీలకం

కుప్పం.. పరిచయమే అక్కర్లేని నియోజకవర్గం.. 1989 నుంచి టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబును అప్రతిహతంగా గెలిపిస్తూ వస్తున్నారు. ఈసారి ఇక్కడ ఆయన విజయం గురించి కాకుండా ఆయనకు ప్రజలిచ్చే మెజారిటీ ఎంత అనే అంశంపై చర్చ నడుస్తుండడం విశేషం. గత ఎన్నికల్లో ఆయన మెజారిటీ 30 వేలకు తగ్గడంతో.. ఈసారి లక్ష ఓట్ల అధిక్యానికి తక్కువ కాకుండా సాధించేందుకు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు అహర్నిశలు పని చేస్తున్నాయి. గతంలో 2014, 19 ఎన్నికల్లో టీడీపీ అధినేతపై పోటీచేసి ఓడిపోయిన కె.చంద్రమౌళి కుమారుడు భరత్‌ను వైసీపీ బరిలోకి దించింది. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపైనే ఈయన పూర్తిగా ఆధారపడ్డారు. ఏ విషయంలోనూ ఆయనకు స్వేచ్ఛ ఇవ్వకుండా ఆయన్ను ముందుంచి పెద్దిరెడ్డి చక్రం తిప్పుతున్నారు.

డిపాజిట్ సొమ్ము చెల్లించేది ప్రజలే..

చంద్రబాబు ఇప్పటి వరకు ఇక్కడ ఏడుసార్లు విజయం సాధించారు. ఎనిమిదోసారి పోటీ చేస్తున్నారు. ప్రతి ఎన్నికల సమయంలోనూ నామినేషన్ వేసేందుకు ఆయన హాజరవరు. ప్రజలే చందాలేసుకుని మరీ ఆయన నామినేషన్ డిపాజిట్ ఖర్చు భరించడం ఆనవాయితీగా వస్తోంది. ఈసారి ఆయన సతీమణి భువనేశ్వరి వచ్చి అట్టహాసంగా చంద్రబాబు తరఫున నామినేషన్ దాఖలు చేశారు. గతంలో ఎన్నడూ ఎన్నికల ప్రచారంలో పాల్గొనని ఆమె.. ఇప్పుడు కుప్పంపై ప్రత్యేక దృష్టి సారించి విస్తృతంగా పర్యటిస్తున్నారు.

అన్నింటికీ కుప్పమే వేదిక

చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ప్రతి కార్యక్రమాన్ని, పథకాన్ని కుప్పం వేదికగా ప్రారంభించేవారు. ఇజ్రాయెల్ తరహా వ్యవసాయ విధానాన్ని ఇక్కడి ప్రజలకు పరిచయం చేశారు. బిందు, తుంపర్ల సేద్యానికీ ఇక్కడి నుంచే నాంది పలికారు. తాజాగా ఎన్నికల ప్రచార కార్యక్రమం ప్రజాగళాన్ని కూడా కుప్పం నుంచే ప్రారంభించారు. గతేడాది జనవరిలో లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్రకూ కుప్పమే వేదికైంది. మూడు రాష్ట్రాలకు కూడలిగా ఉన్న కుప్పం చంద్రబాబు రాకముందు బాగా వెనుకబడిన ప్రాంతంగా ఉండేది. ఈ 35 ఏళ్లలో ఆయన కుప్పాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేశారు. అన్ని గ్రామాల్లో తారు రోడ్లు, సీసీ రోడ్లు నిర్మించడంతో పాటు ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీలు, గురుకులాలు, ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలతో ప్రతిష్ఠాత్మక ద్రవిడ విశ్వవిద్యాలయాన్నీ ఇక్కడే నెలకొల్పారు. దీంతో పాటు ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా అనేక కార్యక్రమాలు చేస్తున్నారు. 'నేను మూడుసార్లు సీఎంగా పనిచేసి ప్రపంచ దేశాలు తిరిగి రాష్ట్రాభివృద్ధికి కృషి చేశానంటే దానికి కుప్పం ప్రజలే కారణం. వారి రుణాన్ని ఎప్పటికీ తీర్చుకోలేను' అని చంద్రబాబు నిత్యం గుర్తు చేసుకుంటూ ఉంటారు.



కేఆర్‌జే భరత్ (వైసీపీ)

ఐదేళ్లుగా వైసీపీ విధ్వంసం..

వైఎస్ సహా గతంలో కాంగ్రెస్ సీఎంలుగా పనిచేసిన వారంతా కుప్పం జోలికి వెళ్లలేదు. చంద్రబాబును ఇబ్బంది పెట్టలేదు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ మంత్రి పెద్దిరెడ్డి కుప్పాన్ని టార్గెట్ చేసి ఈ ఐదేళ్ల పాటు విధ్వంసం సృష్టించారు. ఆయన అండతో శాంతిపురం మండలం 81.ముద్దనపల్లెలో వైసీపీ నేతలు సుమారు 250 ఎకరాల్లో విచ్చలవిడిగా అక్రమ క్వారీలను నిర్వహించి ప్రకృతి సంపదను కొల్లగొట్టారు. 2022 జనవరిలో చంద్రబాబు ఆ ప్రాంతాన్ని పరిశీలించి జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్‌జీటీ)కి ఫిర్యాదు చేయడంతో దోపిడీకి అడ్డుకట్ట పడింది. స్థానిక ద్రవిడ విశ్వవిద్యాలయం ప్రాంగణంలోనూ మైనింగ్ చేసి ఛిద్రం చేశారు. నియోజకవర్గంలో చిన్న కుంట, చెరువు కనిపించినా మట్టిని అక్రమంగా తవ్వేశారు. ప్రభుత్వ భూములను కబ్జా చేశారు. కర్ణాటక మద్యం అక్రమ వ్యాపారం ద్వారా నెలకు రూ.కోటి సంపాదించుకుంటున్నారు. కుప్పం గ్రామీణ విద్యుదీకరణ సంస్థ (రెస్కో)లో ఒక్కో ఉద్యోగానికి రూ.10 లక్షలు తీసుకున్నట్లు ఆరోపణలున్నాయి. 2023 జనవరిలో కుప్పంలో చంద్రబాబు పర్యటించకుండా జీవో నంబర్ 1 పేరుతో పోలీసులు అడ్డుకున్నారు. విధి నిర్వహణను అడ్డుకున్నారని 60 మంది టీడీపీ కార్యకర్తలపై కేసులు పెట్టారు. కుప్పంలోని అన్న క్యాంటీన్‌ను ధ్వంసం చేశారు. తిరిగి టీడీపీ నాయకులపైనే కేసులు పెట్టారు. 2022 ఆగస్టులో చంద్రబాబు పర్యటించే ప్రాంతాల్లో వైసీపీ శ్రేణులు ఆ పార్టీ జెండాలు కట్టి, టీడీపీ శ్రేణుల్ని రెచ్చగొట్టాయి. పరస్పరం ఘర్షణ జరిగితే 40 మంది టీడీపీ కార్యకర్తలపై కేసులు నమోదు చేశారు. ఇలా నియోజకవర్గంలోని వందల మంది కార్యకర్తలపై కేసులు పెట్టారు. రౌడీషీట్లు తెరిచారు. చివరికి మహిళలపైనా హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. చంద్రబాబు చేసిన అభివృద్ధిని కనిపించకుండా చేసేందుకు అనేక రకాలుగా విధ్వంసం చేశారు. కుప్పంలో టీడీపీ శ్రేణులను మానసికంగా దెబ్బ కొట్టేందుకు మంత్రి పెద్దిరెడ్డి స్థానిక సంస్థల ఎన్నికల్లో కనీవినీ ఎరుగని అక్రమాలకు తెరదీశారు. తన నియోజకవర్గం పుంగనూరులో చేసుకున్నట్లు కుప్పంలోనూ అక్రమంగా ఏకగ్రీవాలు చేసుకున్నారు.టీడీపీ నేతలు నామినేషన్లు వేయకుండా.. బెదిరించి దాడులు చేసి అడ్డుకుని.. ఓటుకు ఐదేసి వేలు పంపిణీ చేసి..దొంగ ఓట్లతో కుప్పం మున్సిపాలిటీ సహా మెజారిటీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలు వైసీపీ ఖాతాలో వేశారు. ఈ అరాచకాలు చూసి కుప్పం ప్రజలు బిత్తరపోయారు. వైసీపీకి బుద్ధిచెప్పాలని కృతనిశ్చయంతో ఉన్నారని టీడీపీ వర్గాలు అంటున్నాయి.

చంద్రబాబు బలాలు..

35 ఏళ్లుగా నియోజకవర్గ అభివృద్ధి.. 3 నెలలకోసారి వచ్చి ప్రజలతో మమేకం కావడం. భార్య భువనేశ్వరి ప్రచారం. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో బాబును అక్రమంగా అరెస్టు చేసి జైలు పాల్జేయడంపై ప్రజల్లో జగన్ పట్ల ఆగ్రహం.

బలహీనతలు..

టీడీపీ స్థానిక నేతల్లో విభేదాలు.. లోకల్‌గా జరిగే పరిణామాలు చంద్రబాబు వరకు వెళ్లకపోవడం.

భరత్ బలాలు..

వైసీపీ కేడర్.. మంత్రి పెద్దిరెడ్డి అండ..

బలహీనతలు..

ఐదేళ్లుగా వైసీపీ నేతలు సాగించిన విధ్వంసం.. జగన్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత.. స్థానిక నేతలతో సమన్వయం లేకపోవడం.. కొందరినే దగ్గరకు తీసి మిగిలిన వారిని దూరం పెట్టడంతో వర్గాలు తయారు కావడం. స్థానికేతరుడనే ముద్ర.

నియోజకవర్గ స్వరూపం..

(కుప్పం మున్సిపాలిటీ, కుప్పం, గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పం మండలాలు)

మొత్తం ఓటర్లు: 2,25,775

పురుషులు: 1,12,510.. మహిళలు: 1,13,247..

ట్రాన్స్‌జెండర్లు: 18

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి